పహల్గాం ఉగ్రదాడి జరిగిన స్థలంలో
కేబినెట్ భేటీ




2


కలం నిఘా
WWW.KALAMNIGHA.COM
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ బుధవారం 28 మే 2025
సంపుటి: 15, సంచిక: 49, పేజీలు 8, వెల: 4.00
Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam





2లో..
ఉభయ తెలుగు రాష్ట్రాలకు కొత్త జడ్జిలు


# నిజాయితీ రాజకీయాలే...
# తెలుగుదేశం ఆస్తులు

## పాలన అంటే హత్యలు... తప్పుడు కేసులు కాదు



- నేరస్తులు ఎక్కడున్నా వదిలిపెట్టే ప్రసక్తి లేదు
- ఏమీ ఆశించకుండా పార్టీ జెండా మోస్తున్న కార్యకర్తలు
- ఎన్డీఏతో సంబంధం పెట్టుకోవడం బాగా కలిసి వచ్చింది
- ప్రజలు తీర్పుకు ధన్యవాదాలు తెలపడమే మహాసభ ఉద్దేశం
- మహానాడు చరిత్ర సృష్టించబోతోందన్న చంద్రబాబు
- కడపలో మూడు రోజుల పసుపు పండగ ప్రారంభం

**పీక కోస్తున్నా జై టీడీపీ అన్న చంద్రయ్య మనకు స్ఫూర్తి**

కడప మే 27 (నిఘా న్యూస్)

దేవుని గడపలో జరిగే ఈ మహానాడు చరిత్ర సృష్టించబోతోంది. ఉమ్మడి కడప జిల్లాలో పది స్థానాలకు ఏడు స్థానాలు గెలిచి సత్తా చాటాం. ఈసారి ఇంకాస్త కష్టపడితే పదికి పది స్వీప్ చేస్తాం. కడపలో ప్రజలు ఇచ్చిన తీర్పుకు ధన్యవాదాలు తెలపడం కోసమే ఈ మహానాడు నిర్వహిస్తున్నాం అని చంద్రబాబు తెలిపారు. కడప గడ్డపై తొలిసారి మహానాడు నిర్వహిస్తున్నామని, దేవుని కడపలో జరిగే మహానాడు చరిత్ర సృష్టించబోతోందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో 57 శాతం ఓట్ షేరింగ్ సాధించాం. ఎన్డీఏతో సంబంధం పెట్టుకోవడం వల్ల కూడా మనకు కలిసి వచ్చింది. పార్టీ పని అయిపోయిందని అనుకునే వాళ్లకు వాళ్ల పని అయిపోయింది. పాలన అంటే హత్య రాజకీయాలు, వేధింపులు, తప్పుడు కేసులు కాదు. విధ్వంసం పేరుతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. ప్రశ్నించిన కార్యకర్తలని అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేశారు. పీక కోస్తునా చంద్రయ్య జై తెలుగుదేశం అంటూ ప్రాణాలు వదిలాడు. ఆయనే మనకు స్ఫూర్తి. ఆ స్ఫూర్తే పార్టీని నడిపిస్తుంది. ప్రతిపక్షంలో ఉన్నా అధికారంలో ఉన్నా కార్యకర్తల్లో అదే జోరు. ఏవిరీ ఆశించకుండా పార్టీ జెండా మోస్తున్న కార్యకర్తల వల్లే ..మిగతా 2లో



## కేసీఆర్ డైరెక్షన్‌లో జూన్‌లో
# కవిత కొత్త పార్టీ

### షర్మిల లాగే పాదయాత్రకు సన్నాహాలు
### బీజేపీ ఎంపీ రఘునంద్ రావు వ్యాఖ్యలు

తూప్రాన్ మే 27 (నిఘా న్యూస్)

తెలంగాణలో ఎమ్మెల్సీ కవిత పాదయాత్ర చేస్తారని, అలాగే జూన్ 2న కొత్త పార్టీ ప్రకటన చేస్తారని మెదక్ ఎంపి రఘునందన్ రావు తెలిపారు. జూన్ 2న కవిత కొత్త పార్టీ రాబోతుందని, పార్టీ పెట్టి షర్మిల తరహాలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేయనుందని అన్నారు. తుప్రాన్ లో రఘునందన్ రావు పర్యటించారు. ఆయన విరీడియాతో మాట్లాడుతూ బిఆర్ఎస్ లో జరుగుతున్న పరిణామాలపై జోస్యం చెప్పారు. మాజీ సిఎం కెసిఆరే కవితతో పార్టీ పెట్టిస్తున్నారని అన్నారు. తండ్రి, కుమార్తె మధ్య మధ్యవర్తులెందుకని ప్రశ్నించారు. కవిత గెలిచినప్పుడు కెసిఆర్ దేవుడయ్యారని, ఇప్పుడు దెయ్యం ఎలా అయ్యారని విమర్శించారు. దెయ్యాల మధ్య పదేళ్ల రాజకీయం ఎందుకని రఘునందన్ ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాసిన లేఖ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనమైంది. ఈ లేఖపై ఇప్పటికే అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ నేతలు తమదైన శైలిలో వ్యంగ్య బాణాలు సంధిస్తున్నారు. అలాంటి వేళ మెదక్ ఎంపీ , బీజేపీ నేత రఘునందన్ రావు ..మిగతా 2లో

## రూ.500 నోట్లను
# రద్దుచేయాలి

### అవినీతికి పెద్దనోట్లే అడ్డంకి
### డిజిటల్ లావాదేవీలకు మార్చాలి

2





# థియేటర్లలో ధరల నియంత్రణకు చర్యలు

### డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

2లో..



## జూన్ 2 నుంచి...
## రాజీవ్ యువ వికాసం
# మంజూరు

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్ మే 27(నిఘా న్యూస్)

రాజీవ్ యువవికాసంపై తెలంగాణ డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క సమావేశం నిర్వహించారు. జూన్ 2 నుంచి 9 వరకు రాజీవ్ యువ వికాసం మంజూరు పత్రాలు పంపిణీ చేయనున్నట్లు- భట్టి విక్రమార్క వెల్లడిరచారు. జూన్ 15 తర్వాత రాజీవ్ యువ వికాసం యూనిట్ల గ్రౌండింగ్ ఉంటుందని, అక్టోబర్ 2 నాటికి 5లక్షల మందికి దశలవారీగా లబ్ధి చేకూరేలా ప్రణాళిక వేసినట్లు- తెలిపారు. తొలి విడతలో రూ.లక్షలోపు యూనిట్లకు ప్రొసీడిరగ్స్ ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి సీతక్క తెలిపారు. ఉపాధి అవకాశల కల్పన కోసం రాజీవ్ యువ వికాసం ద్వారా జూన్ 2న ..మిగతా 2లో

## ఉగ్రవాదమే
# పాక్ యుద్ధ వ్యూహం



### అధికార లాంఛనా లతో ఉగ్రవాదుల అంత్యక్రియలు
### గుజరాత్‌లో ప్రధాని మోడీ పర్యటన

గుజరాత్ మే 27 (నిఘా న్యూస్)

పాకిస్థాన్‌ఆచరిస్తున్న ఉగ్రవాదంమే ఉద్దేశపూర్వక యుద్ధ వ్యూహమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భారత్ ఆ వ్యూహాన్ని తిప్పికొట్టడానికి గట్టిగా బదులిస్తుందని స్పష్టం చేసారు. ఆపరేషన్ సిందూర్‌లో హతమైన ముష్కరుల అంత్యక్రియలను పాక్ ప్రభుత్వం అధికార లాంఛనాలతో నిర్వహించిందని మోదీ దుయ్యబట్టారు. ఉగ్రవాదుల శవపేటికలపై పాక్ జాతీయజెండా కప్పటంతోపాటు సైన్యం సెల్యూట్ చేసినట్లు తెలిపారు. అందువల్ల పాక్ భూభాగం నుంచి జరుగుతున్న ఉగ్రవాదుల ..మిగతా 2లో



## జూన్ 3 నుండి
# రెవెన్యూ సదస్సులు

### భూ భారతి పేద రైతులకు చుట్టం
### 90 శాతం పూర్తయిన ధాన్యం కొనుగోళ్లు
### మంత్రులు అధికారులతో ముఖ్య మంత్రి రేవంత్ వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్ మే 27 (నిఘా న్యూస్)

తమ ప్రభుత్వం తీసుకొచ్చిన 'భూ భారతి' అనేది పేద రైతుకు చుట్టమన్నారు సీఎం రేవంత్ రెడ్డి. భూభారతిపై అవగాహన సదస్సులు నిర్వహించాలని, ఈ చట్టాన్ని ప్రజలకు మరింత చేరువ చెయ్యాలన్నారు సీఎం రేవంత్. దీనిలో భాగంగా ..మిగతా 2లో

# అవినీతిలో మునిగిన బీఆర్ఎస్ నేతలు

### నీతులు పలికితే జనం నమ్మరు
### లిక్కర్ కవిత ఎవరికి నీతులు చెబుతారు
### మండిపడ్డ బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

హైదరాబాద్ మే 27 (నిఘా న్యూస్) బీఆర్ఎస్ పార్టీపై బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దోచిన బీఆర్ఎస్ ఇప్పుడు నీతి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. లిక్కర్ కేసులో జైలు నుంచి వచ్చి కవిత ఎవరికి నీతి పాఠాలు చెబుతోందని అంటూ ప్రశ్నించారు. కుంభకోణాలకు సంబంధించి కేసీఆర్, కేటీఆర్‌లకు నోటీసులు వచ్చాయని, ఇవి రాజకీయ నోటీసులు కాకుండా అవినీతి ఆరోపణలపై విచారణ నోటీసులేనని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రధాన ప్రతిపక్ష నేతగా, ఎమ్మెల్యేగా విఫలమయ్యారు. కేటీఆర్ ఇప్పటికే అనేక విచారణలకు ..మిగతా 2లో



# నిజాయితీ రాజకీయాలే... తెలుగుదేశం ఆస్తులు

**మొదటి పేజీ తరువాయి...**



విజయం సాధ్యమైందని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. కడపలో ప్రజలు ఇచ్చిన తీర్పుకు ధన్యవాదాలు తెలపడం కోసమే ఈ మహానాడు నిర్వహిస్తున్నాం అని సీఎం తెలిపారు. ఉమ్మడి కడప జిల్లాలో పది స్థానాలకు ఏడు స్థానాలు గెలిచి సత్తా చాటాం అని, ఈసారి ఇంకాస్త కష్టపడితే పదికి పది స్వీప్ చేస్తాం అని ధీమా వ్యక్తం చేశారు. మహానాడులో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ 'రాయలసీమలో మహానాడు అంటే తిరుపతిలో ఉండేది. తిరుమల తొలిగడప కడపలో మంగళవారం మహానాడు చేసుకుంటున్నందుకు ఆనందంగా ఉందన్నారు.పార్టీ పని అయిపోయిందని అనుకునే వాళ్లకు వాళ్ల పని అయిపోయింది. అని సిఎం చంద్రబాబు అన్నారు. ఉదయం 10 గంటల వరకు ప్రతినిధుల నమోదు కార్యక్రమం జరిగింది. సిఎం చంద్రబాబు పార్టీ సభ్యత్వాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను తిలకించారు.

## జూన్ 3 నుండి రెవెన్యూ సదస్సులు

**మొదటి పేజీ తరువాయి...**

జూన్ 3వ తేదీ నుంచి 20 వరకూ మూడో దశ రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని అధికారులకు, కలెక్టర్లకు సీఎం రేవంత్ సూచించారు. మంగళవారం అధికారులు, కలెక్టర్లు, మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు అంశంపై సీఎం రేవంత్ మాట్లాడారు. ఈసారి 15 రోజుల ముందే రుతుపవనాలు వచ్చాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి అత్యధికంగా 64 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగింది. ఇప్పటివరకు 90 శాతం ధాన్యం సేకరణ పూర్తయింది. ఈ సందర్భంగా అధికారులు, కలెక్టర్లను నేను అభినందిస్తున్నా. రుతుపవనాలు ముందుగా రావడంతో మిగతా ధాన్యం సేకరించడం ఇబ్బందిగా మారింది. ధాన్యం కొనుగోలు చేసి ఇప్పటి వరకు రైతులకు రూ. 12184 కోట్లు చెల్లించాం. గతంలో ఎప్పుడూ లేని విధంగా ధాన్యం సేకరించిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నాం. చేసిన మంచి పనిని చెప్పుకోకపోవడం వల్లే చిన్న చిన్న సంఘటనలు ప్రచారంలోకి వస్తున్నాయి. కొన్నిచోట్ల రాజకీయ ప్రేరేపిత సంఘటనలు జరుగుతున్నాయి. అనారోగ్యంతో రైతు చనిపోతే ధాన్యం కొనుగోలు వల్లనే అని దుష్ప్రచారం చేశారు. కలెక్టర్లు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు వివరాలను వెల్లడించాలి. కలెక్టర్లు ప్రో యాక్టివ్ గా ఉండాలి. వైఫల్యాలు ఉంటే సరిదిద్దుకోవాలి.. తప్పుడు ప్రచారం చేస్తే వివరణ ఇవ్వండి. చిన్న చిన్న సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించండి. ఒక్క నిముషం వృధా చేయొద్దు.నిర్లక్ష్యం వహించొద్దు. అవసరమైతే లోకల్ గోడౌన్స్ హైర్ చేయండి.మిల్లర్లు, దళారులు రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకోండి. ఈసారి 29 శాతం వర్షపాతం అధికంగా ఉంది.సీజన్ ముందు రావడంతో వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలి. రైతులకు విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయి.పంటల వివరాలు, స్థానిక అవసరాలను గుర్తించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలి. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే అలాంటి వారిపై పీడీ యాక్ట్ పెట్టండి. నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలి. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలి. జిల్లాలవారిగా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియనించుకోండి' అని ముఖ్యమంత్రి రేవంత్ సూచించారు.

## కెసిఆర్ డైరెక్షన్‌లో జూన్‌లో కవిత కొత్త పార్టీ

**మొదటి పేజీ తరువాయి...**

మరోసారి స్పందించారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తండ్రి, కుమార్తెల మధ్య మధ్యవర్తులెందుకని ఆయన సూటిగా ప్రశ్నించారు. జూన్ 2వ తేదీన కవిత కొత్త పార్టీ రాబోతోందని ఆయన జోస్యం చెప్పారు. అనంతరం తెలంగాణలో కవిత పాదయాత్ర చేస్తారని ప్రకటించారు. కవిత గెలిచినప్పుడు కేసీఆర్ దేవుడయ్యారని, మరి ఇప్పుడు దెయ్యం ఎలా అయ్యారంటూ ఎంపీ రఘునందన్ సందేహం వ్యక్తం చేశారు. ఏప్రిల్ 27వ తేదీన బీఆర్ఎస్ రజతోత్సవ సభ వరంగల్‌లో నిర్వహించారు. ఈ సభకు పార్టీ నేతలతోపాటు కార్యకర్తలంతా భారీగా తరలి వచ్చారు. అనంతరం ఈ సభలో తన తండ్రి కేసీఆర్ ప్రసంగంతో పాటు- కొన్ని అంశాలతో కూడిన లేఖను ఆయనకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత రాశారు. అయితే ఈ లేఖ ఇటీవల సోషల్ విరీడియాలో వైరల్‌గా మారింది. ఈ లేఖను లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ పార్టీపై కాంగ్రెస్, బీజేపీ అగ్రనేతలు తమద్కైన శ్కెలిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఆ తర్వాత కేసీఆర్‌తో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్ వరుసగా సమావేశమవుతున్నారు. మరోవైపు, కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా మేడిగడ్డ రిజర్వాయర్ నిర్మాణంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను రేవంత్ రెడ్డి సర్కార్ ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ ఎదుట హాజరు కావాలంటూ కేసీఆర్‌తోపాటు- హరీష్ రావు, ఈటల రాజందర్‌లకు నోటీసులు జారీ అయ్యాయి. జూన్ 5వ తేదీన కమిషన్ ఎదుట హాజరు కావాలంటూ బీఆర్ఎస్ చీఫ్‌కు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ జారీ చేసిన ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఈ టాపిక్ డ్కెవర్షన్ కోసమే ఈ లెటర్ పాలిటిక్స్ అనే ఓ చర్చ సైతం రాష్ట్రంలో కొనసాగుతోంది.

## రూ.500 నోట్లను రద్దుచేయాలి

**కడప మే 27 (నిఘా న్యూస్)**

భారతదేశంలో మళ్లీ పెద్ద నోట్లన్నీ రద్దు చేయాలని ప్రధాని నరేంద్ర మోడీని ఏపీ సీఎం చంద్రబాబు కోరారు. పెద్ద నోట్ల రద్దుతో దేశంలో అవినీతి తగ్గించవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం చలామణిలో ఉన్న రూ.500 నోట్లను కూడా రద్దు చేసి.. ఆర్థిక లావాదేవీలను డిజిటల్‌లోకి పూర్తిగా మారిస్తేనే అవినీతిని రూపుమాప వచ్చన్నారు. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో వాట్సప్ గవర్నర్స్ తీసుకొచ్చాం అని, ఇది ఒక గేమ్ చేంజర్ అని చెప్పారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తాం అని స్పష్టం చేశారు. ప్రతి వ్యక్తికి ఈ రాష్ట్రంలో భద్రత కల్పిస్తాం అని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. కడపలో నిర్వహిస్తున్న టీడీపీ మహానాడు 2025లో సీఎం ప్రసంగించారు. అన్నదాతకు రూ.20 వేలు ఇస్తున్నాం. మూడు విడతలుగా రైతుల అకౌంట్లో నగదు జమ చేస్తాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు శుభవార్త చెబుతూ ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తాం. ప్రతి వ్యక్తికి ఈ రాష్ట్రంలో భద్రత కల్పిస్తాం. ప్రభుత్వ పనితీరు పైన కూడా ఎప్పటికప్పుడు ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపడతాం. పనిచేయని అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. దేశంలో పెద్ద నోట్లు రద్దు చేయండని, డిజిటల్ కరెన్సీ తేవాలని ప్రధాని నరేంద్ర మోడీని కోరా. అన్ని పెద్ద పెద్ద నోట్లు రద్దు చేయాలి, అప్పుడే ఈ దేశంలో పూర్తిగా అవినీతి నశిస్తుంది' అని సీఎం చంద్రబాబు అన్నారు. అమరావతి పూర్తి చేస్తాం. రాయలసీమ సమగ్ర అభివృద్ధి నా బాధ్యత. కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలలో ఫ్యాక్షన్‌ను అంతం చేశాం. పోయిన ఐదు సంవత్సరాలలో ఇరిగేషన్ కోసం ఒక్క పైసా ఖర్చు పెట్టలేదు. హంద్రీనీవా కాలవ పనులు ఏడదిలో పూర్తిచేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం ' అని సీఎం చెప్పారు.

## అవినీతిలో మునిగిన బీఆర్ఎస్ నేతలు

**మొదటి పేజీ తరువాయి...**

లోనవుతున్నారు. ఇదే సమయంలో హరీష్ రావు, కవిత వంటి నేతలు కూడా అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. అందుకే ఈ నేతలు తక్షణం తమ పదవులకు రాజీనామా చేయాలని అన్నారు. ఈటల రాజేందర్‌కు వచ్చిన నోటీసులపై పార్టీ స్థాయిలో చర్చించి తదుపరి కార్యాచరణ చేపడతామని వెల్లడించారు. ఈటలపై విచారణ జరుగుతుంది. ఈ విచారణలో బీఆర్ఎస్ నేతల అవినీతి ఆరోపణలు బట్టబయలవుతాయని మేము ఆశిస్తున్నాం, అని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తెలిపారు. కవిత లేఖ బయటకు వచ్చిందన్నదే కాదు.. డీల్ బయటపడినందుకే వాళ్లకు భయం అంటూ బీఆర్ఎస్ నేతలను మరోసారి విమర్శించారు. నీతి ఆయోగ్ 10వ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనడాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రభాకర్ తెలిపారు. అయితే 9వ సమావేశానికి హాజరుకాలేదని గుర్తుచేస్తూ, అప్పుడు ముఖ్యమంత్రి ఎవరినిమిత్తం, ఎందుకోసం గైర్హాజరయ్యారనే ప్రశ్నను ఆయన లేవనెత్తారు. నీతి ఆయోగ్ సమావేశాల ఉద్దేశం రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్న దానిపై కేంద్రం నమ్మకం పెట్టుకున్నదని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి ఫెడరల్ స్ఫూర్తితో సమావేశంలో పాల్గొనడం సానుకూల పరిణామం. కానీ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలను ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పాటించడం లేదు. కనీసం ఇప్పుడు అయినా వాటిని అమలు చేయాలని అధికార యంత్రాంగానికి సీఎం ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.

## ధియేటర్లలో ధరల నియంత్రణకు చర్యలు

**డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్**

అమరావతి మే 27 (నిఘా న్యూస్)కొత్త చిత్రాల విడుదల సందర్భంలో టికెట్ ధరల పెంపు కోసం నిర్మాతలు, వారికి సంబంధించిన వారు వ్యక్తిగత హెూదాలో కాకుండా తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి ద్వారానే ప్రభుత్వాన్ని సంప్రదించే విధానాన్ని అమలు చేయాలి. టికెట్ ధరల పెంపు, సినిమా హాళ్ల నిర్వహణ ఏ విషయంలోనైనా ప్రభుత్వ శాఖలు తమ విధులను, పర్యవేక్షణను పకడ్బందీగా చేయాలి. త్వరలో విడుదలయ్యే 'హరిహర వీరమల్లు' సినిమాకు సైతం టికెట్ ధరల పెంపు కోసం నిర్మాత వ్యక్తిగతంగా కాకుండా చలనచిత్ర వాణిజ్య మండలి ద్వారానే ప్రభుత్వానికి అర్జీ ఇచ్చి, సంప్రదింపులు చేయాలి. ఇందులో ఎలాంటి బేధాలు పాటించవద్దు' అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

**'ధరలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలి'**

టికెట్ ధర కంటే సినిమా హాల్లో పాప్ కార్న్ లాంటి తినుబండారాలు, శీతల పానీయాలు, చివరకు మంచి నీళ్ల సీసాల ధరలు సైతం భారీగా ఉండటంపై పవన్ కల్యాణ్ చర్చించారు. వాస్తవంగా వాటి ధరలు ఎంత ఉంటున్నాయి, ఇంతకు విక్రయిస్తున్నారు, అసలు వాటిలో ఉండే నాణ్యత ప్రమాణాలు ఏమిటనేది కూడా సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ధరల నియంత్రణ కూడా చేపట్టాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మల్టీప్లెక్సులు, సింగిల్ స్క్రీన్స్ లో ఆహార పదార్థాలు, శీతల పానీయాల వ్యాపారంలోను గుత్తాధిపత్యం సాగుతోందనే విషయం కూడా ప్రభుత్వ దృష్టికి వచ్చినందున దీనిపై విచారణ చేపట్టాలని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రికి సూచించారు.

ప్రేక్షకులు కుటుంబ సమేతంగా సినిమా హాలుకు రావాలంటే తినుబండారాలు, పానీయాల ధరలు చూసి వెనుకంజ వేసే పరిస్థితి రాకూడదని ఉప ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ధరలు తగ్గితే ప్రేక్షకుల సంఖ్యా పెరుగుతుంది, తద్వారా పన్ను ఆదాయం కూడా పెరుగుతుంది. ఈ అంశంపై పన్నుల శాఖతో పరిశీలన చేయించాలన్నారు. ధియేటర్లలో తాగునీటి ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ అనేవి యజమానులు కనీస బాధ్యతలని, వాటిని పాటించేలా స్థానిక సంస్థలు చూసుకొంటాయన్నారు.

**'జనసైనికులు ఉన్నా చర్యలు తీసుకోవాల్సిందే'**

తెలుగు చిత్ర రంగంలో సినిమా హాళ్ల బంద్ ప్రకటనలు వెలువడటానికి గల నేపథ్యం, ఆ నలుగురు ప్రమేయం, తమకు సంబంధం లేదని ఇద్దరు నిర్మాతలు ప్రకటించడం, తూర్పు గోదావరి జిల్లాలోనే తొలుత బంద్ ప్రకటన వెలువడటం తదితర అంశాలు గురించి కూడా పవన్ కల్యాణ్ చర్చించారు. బంద్ అంశంపై చేపట్టిన విచారణ పురోగతిని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వివరించారు. బంద్ ప్రకటన వెనక జనసేన నాయకుడు ఉన్నారని ఒక నిర్మాత మీడియా ముందు ప్రకటించిన విషయంపైనా చర్చించారు. ఈ ప్రకటన వెనక ఒక సినీ నిర్మాత, సినిమా హాళ్లు కలిగిన ఒక రాజకీయ నాయకుడి ప్రమేయం ఉన్నాయని సినిమా వర్గాలు చెబుతున్న క్రమంలో ఈ కోణంలో కూడా విచారణ చేయించాలనిపవన్ కళ్యాణ్ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రికి సూచించారు. సినిమా రంగంలో అవాంఛనీయమైన పరిస్థితులకు కారణమైన బంద్ అనే ప్రకటన వెనకగల కారణాలు తెలుసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు.

## జూన్ 2 నుంచి రాజీవ్ యువ వికాసం మంజూరు

**మొదటి పేజీ తరువాయి...**

లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందజేయనున్నామని వెల్లడిరచారు. రూ. లక్ష లోపు యునిట్లకు మొదటి దశలో ప్రొసిడిరగ్స్ ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సం సందర్భంగా రేవంత్ ప్రభుత్వం ఎంపి-కై-న లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందించనున్నట్లు- ప్రకటించారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ప్రభుత్వం తమదని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఒక వైపు ప్రభుత్వ ఉద్యోగాలను కల్పిస్తూనే,మరో వైపు స్వయం ఉపాది అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. మొదటి విడతలో రూ. లక్ష లోపు యునిట్లకు ప్రొసిడిరగ్స్ ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించిందని, దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులంతా రాజీవ్ యువ వికాసాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. నిరుద్యోగుల పాలిట వరంగా రాజీవ్ యువ వికాసం నిలుస్తోందని, బడుగు బలహీన వర్గాలు, పేద యవత జీవితాల్లో రాజీవ్ యువ వికాసం వెలుగులు నింపనుందని వ్యాఖ్యానించారు.

## పహల్గాం ఉగ్రదాడి... జరిగిన స్థలంలో కేబినెట్ భేటీ

**శ్రీనగర్ మే 27 (నిఘా న్యూస్)**

జమ్ముకశ్మీర్ లోని పహల్గాం సమీపంలోగల బైసరన్ లోయలో జరిగిన ఉగ్రదాడితో యావత్ భారతదేశం ఉలిక్కిపడింది. ఇవాళ ఆ ఉగ్రవాద దాడి జరిగిన ప్రదేశంలో జమ్ముకశ్మీర్ క్యాబినెట్ ప్రత్యేకంగా సమావేశమైంది. పిరికిపంద చర్యలకు తాము ఏమాత్రం భయపడబోమనే సందేశం టెర్రరిస్టులకు చేరేలా జమ్ముకశ్మీర్ ప్రభుత్వం ఈ సమావేశం నిర్వహించింది. జమ్ముకశ్మీర్‌లోని వేసవి రాజధాని శ్రీనగర్, శీతాకాల రాజధాని జమ్ము కాకుండా వెలుపల ఇలా అక్కడి క్యాబినెట్ భేటీ కావడం ఈ నూతన ప్రభుత్వ హయాంలో ఇదే తొలిసారని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా చెప్పారు. ప్రకృతి అందాలకు నెలవైన పహల్గాంలోని బైసరన్‌లో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు బలయ్యారు. దాంతో అప్పటి నుంచి పర్యాటకుల రాక తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో పర్యాటకంపైనే ఆధారపడిన స్థానిక ప్రజలకు సంఘీభావంగా ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు ఒమర్ మీడియాకు వెల్లడించారు.

'మేం ప్రజల ధైర్యానికి సెల్యూట్ చేస్తున్నాం. పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు పహల్గాంకు వచ్చాం. ఆ దిశగా చర్యలు కొనసాగుతాయి' అని ఒమర్ అబ్దుల్లా అన్నారు. పహల్గాం క్లబ్‌లో జరిగిన మీటింగ్ దృశ్యాలను ఎక్స్ వేదికగా షేర్ చేశారు. ఉగ్రవాదుల పిరికిపంద చర్యలకు ఏ మాత్రం భయపడేదిలేదనే స్పష్టమైన సందేశాన్ని ఇచ్చేందుకే ఇక్కడకు వచ్చామని, జమ్ముకశ్మీర్ దృఢంగా నిలబడుతుందని ఆ పోస్టులో రాసుకొచ్చారు.

కాగా 2009 నుంచి 2014 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా ఒమర్ అబ్దుల్లా ఉత్తర కశ్మీర్‌లోని గురెజ్, మచిల్, తాంగ్‌ధర్, జమ్ము ప్రాంతంలోని రాజౌరీ, పూంచ్‌లో ఇలా క్యాబినెట్ సమావేశాలు నిర్వహించారు. ప్రధాని మోదీ అధ్యక్షత వహించే నీతిఆయోగ్ సమావేశాన్ని ఇక్కడ నిర్వహించాలని అభ్యర్థించారు. ఈహ తరహా చర్యలు స్థానిక ప్రజల్లో భయాలను తొలగిస్తాయని విశ్వసిస్తున్నానని చెప్పారు.

## ఉగ్రవాదమే పాక్ యుద్ధ వ్యూహం

**మొదటి పేజీ తరువాయి...**



దాడులు పక్కా పథకం ప్రకారం వ్యూహాత్మకంగా చేస్తున్న యుద్ధమని ప్రధాని మోదీ ఆరోపించారు. గుజరాత్ పర్యటనలో భాగంగా గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఈ మేరకు మాట్లాడారు.

'ఉగ్రవాదాన్ని ఇప్పటివరకు పరోక్షయుద్ధం అనేవారం. మే 6తర్వాత నాటి దృశ్యాలు చూసిన తర్వాత దీన్ని పరోక్షయుద్ధం కాదని అర్థమైంది. అందుకు కారణం ఉంది. ఉగ్రవాదుల 9 స్థావరాలను గుర్తించి కేవలం 22 నిమిషాల్లో ధ్వంసం చేయటం జరిగింది. ఈ సారి కెమెరాలు కూడా ఏర్పాటు చేయటం జరిగింది. ఎందుకంటే మనవారే ఎవరైన సాక్ష్యం అడిగితే ఇవ్వటానికి. ఇప్పుడు మనం సాక్ష్యాలు ఇవ్వాల్సిన అవసరం లేకుండా అక్కడివారే ఇస్తున్నారు' అని ప్రధాని మోదీ అన్నారు.

1947లో జరిగిన దేశ విభజన గురించి ప్రధాని మోదీ మాట్లాడారు. '1947లో భారత్‌ను మూడు ముక్కలుగా చేశారు. అదే రోజు రాత్రి కశ్మీర్‌పై మొదటి ఉగ్రవాద దాడి జరిగింది. ఉగ్రవాదుల సాయంతోనే కశ్మీర్‌లోని కొంత భాగాన్ని పాకిస్థాన్ స్వాధీనం చేసుకుంది. సర్దార్ పటేల్ సలహాలను అంగీకరించి, ఆ రోజే ఉగ్రవాదలను చంపిఉంటే భారత్‌లో గత 75 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఉగ్రవాద కార్యకలాపాలు ఉండేవి కాదు. శరీర ఆరోగ్యం ఎంత బాగున్నా ఒక ముళ్లు గుచ్చుకుంటే చాలు ఎప్పుడూ నొప్పి కలుగుతూనే ఉంటుంది. మేం ఆ ముళ్లను తొలగించాలని నిర్ణయించుకున్నాం' అని ప్రధాని మోదీ తెలిపారు.

**త్రివర్ణ పతకాలతో స్వాగతం**

అంతకుముందు ప్రధాని నరేంద్రమోదీ గాంధీనగర్‌లో భారీ రోడ్‌షో నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావటంతో ప్రధానిని అభినందించేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. రాజ్‌భవన్ నుంచి ప్రారంభమైన రోడ్‌షో మహాత్మామందిర్ వరకు సాగింది. రోడ్డు పొడవునా వేలాదిగా బారులుతీరున ప్రజలు త్రివర్ణ పతకాలతో ప్రధానికి స్వాగతం పలికారు. రెండ్రోజుల గుజరాత్ పర్యటనలో భాగంగా గాంధీనగర్‌లో చేపట్టిన రోడ్‌షో నాల్గోది. నిన్న వడోదర, భుజ్, అహ్మదాబాద్‌లో ప్రధాని రోడ్‌షో నిర్వహించారు. గతనెల 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా సైన్యం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ సక్సెస్ తర్వాత తొలిసారి సొంత రాష్ట్రానికి వెళ్లిన ప్రధాని మోదీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారు.

## ఉభయ తెలుగు రాష్ట్రాలకు కొత్త జడ్జిలు

న్యూఢిల్లీ: దేశంలోని వివిధ రాష్ట్రాల్లో11 హైకోర్టులకు చెందిన 21 మంది జడ్జిల బదిలీకి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. మద్రాస్ హైకోర్టు జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్ ఏపీ హైకోర్టుకు, కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ సుమలత తెలంగాణ హైకోర్టుకు, కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ లలిత కన్నెగంటి తెలంగాణ హైకోర్టుకు, పాట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ అభిషేక్‌రెడ్డి తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయాలని కొలీజియం పేర్కొంది.

## ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదులకు నూతన భవనం

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**ఉప్పల్, మే 27 (నిఘా న్యూస్):** చిలుకా నగర్ ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదుల కోసం నూతన భవనం ఏర్పాటు కోసం హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ యోగిత రాణాని మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిశారు. చిలుకా నగర్ ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం స్కూల్ డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ నర్సింహా రెడ్డిని గతంలో కలవగా నూతన భవనం ఏర్పాటు కోసం 236 లక్ష ల రూపాయల నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపడం జరిగింది. ఈ సందర్భగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అదనపు తరగతి గదులు లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం ప్రతిపాదనలు వచ్చిన ఫైల్‌ని వెంటనే మంజూరు చేయాల్సిందిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి యోగితా రానా ను కోరడం జరిగింది. హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితా రానా సానుకూలంగా స్పందిస్తూ వీలైనంత త్వరలో బడ్జెట్ అప్రూవల్ చేయించి శాంక్షన్‌కి పంపుతానని హామీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## మల్లాపూర్‌లో జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి



**మల్లాపూర్, మే 27 (నిఘా న్యూస్):** మాజీ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా మల్లాపూర్ డివిజన్‌లో నెహ్రూ విగ్రహానికి పూల మాల వేసి మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయి కిరణ్ గౌడ్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక భారతదేశ నిర్మాణంలో ఆయన సహకారం, సెక్యులరిజం, విద్య, సైన్స్ అండ్ టెక్నాలజీ, నాన్- అలైన్డ్ ఎస్ఎం మూవ్మెంట్ వంటి రంగాల్లో చేసిన కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దంతూరి రాజు గౌడ్, కోయగురా బాలరాజ్, శ్రీనివాస్ రెడ్డి, రాఘవ రెడ్డి, అంజి రెడ్డి, సీతారాం రెడ్డి, గడ్డం యాదగిరి, జోష్, మనోహర్, వెంకటేష్ గౌడ్, ఉపేందర్ రెడ్డి, మెరుపుల జయంత్, బాలకృష్ణ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మహామాయి దేవాలయంలో అన్న ప్రసాద వితరణ



**ఉప్పల్, మే 27 (నిఘా న్యూస్):** శ్రీ శివ శంకర మహా మాయి దేవాలయం, ఉప్పల్ లో వైశాఖ మాస అమావాస్య సందర్భంగా అమ్మవారి విశేష పూజలు, అన్న ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాలయ సభ్యులు ఉప్పొజి బలవంత చారి, రాష్ట్ర విశ్వకర్మ,విశ్వబ్రాహ్మణ ఆత్మగౌరవ భవన చైర్మన్ లాలుకోట వెంకట చారి, ఉప్పొజి బిక్షపతి,శ్రీను,రాజగోపాల్ చారి,మధు, చోల్లేటి పురుషోత్తం, బ్రహ్మ చారి,శ్రీనివాస్,శ్రీధర్, పాలేర్ల గోపి, చిరంజీవి, శామీర్ పేట హనుమంత్ రెడ్డి,పూడూర్ కృష్ణ రెడ్డి,మామిల్ల బాలరాజ్, గుండాల అనిల్ రెడ్డి,ముదిగొండ జగన్, నర్సింహా చారి,తీగ విఠల్ రావు,నర్సింగ్ రావు,తురాయి దాస్, మహేష్, జగన్, రామ్ ప్రకాష్, గోపి చారి,పసుపు నేటి రమేష్, వెంకటయ్య, కుమార్, భాస్కర్, చారి, గౌడ్, రాజు, సందీప్, సంతోష్, బంటి, శ్రీను, భూత్కూరి సాయి గౌడ్,శ్రీనివాస్ గౌడ్, గణేష్ గౌడ్, యది గౌడ్, వెంకటేష్ తదితర భక్తులు పాల్గొన్నారు.

# డి.ఎస్.పి కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష

### హాజరైన మరికల్ కొస్గి పిఎస్ ల అధికారులు



**నారాయణపేట, మే 27 (నిఘా న్యూస్):** నారాయణ పేట డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ఎన్ లింగయ్య మక్తల్, మరికల్, కోస్గి పోలీస్ అధికారులతో నెల వారి నేర సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. పెండింగ్ ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి డీఎస్పీ అడిగి తెలుసు కొన్నారు. పెండింగ్లో ఉన్న కేసులను తగ్గించేందుకు అధికారులు సమర్థవంతంగా పోలీసులు సంబంధిత అధికారులతో కలిసి సమన్వయంతో పని చేసి పెంగింగ్ తగ్గించాలని డీఎస్పీ సూచించారు. ఈ సందర్భంగా డిఎస్పి నల్లపు లింగయ్య మాట్లాడుతూ కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకుషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలని జిల్లాలో ఇప్పటివరకు నమోదైన గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ఏ విధంగా ఇన్వెస్టిగేషన్ చెయ్యాలి ఏ ఏ అంశాలు క్రోడికరించాలి, తదితర అంశాల గురించి వివరించారు. ఎస్‌సి ఎస్.టి, ఫోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలి. లాంగ్ పెండింగ్ కేసులు త్వరగా చేదించాలి, కేసుల చేదనలో అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించాలి, పెరుగుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి ఛాలెంజ్ గా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని తెలిపారు. మిస్సింగ్ కేసులను త్వరగా చేదించాలని అన్నారు. నేరాల నియంత్రణ కోసం నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, అకస్మికంగా వాహనాల తనిఖీలు నిర్వహించాలని, అనుమానిత వ్యక్తులను ఫింగర్ ప్రింట్స్ డివైస్ తో తనిఖీ నిర్వహించాలని తెలిపారు. పాత నేరస్తులపై పూర్తిస్థాయి నిఘా ఏర్పాటు చేస్తూ వారిని ప్రతిరోజు తనిఖీ నిర్వహించాలని సూచిం చారు. సైబర్ నేరాల నియంత్రణ గురించి సిసి కెమెరాల ఆవశ్యకత గురించి గ్రామాలలో పట్టణా లలో, గ్రామాల విపిఓలు పోలీస్ అధికారులు సిబ్బంది ప్రోయాక్టివ్ పోలీసింగ్ విధులు నిర్వహించాలని, ప్రజలకు సిసి కెమెరాల ప్రాధాన్యాన్ని గుర్తించాలని అన్ని పోలీస్ స్టేషన్ ల పరిధిలోని గ్రామాల్లో ప్రదాన కూడల్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేసి నిరంతరం వాటిని మానిటర్ చేసేవిధంగా ఒకరిని ఏర్పాటు చేయాలని, అలాగే నూతన సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు దాతలు ముందుకు రావాలని వారికి గ్రామాలలో అవగాహన కల్పించి నూతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకు నేవిధంగా చూడాలని డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో సిఐలు రామ్ లాల్, సైదులు, ఎస్ఐ లు భాగ్యలక్ష్మి రెడ్డి, అశోక్ బాబు, నవీద్, విజయ్ కుమార్, బాలరాజు, స్టేషన్ రైటర్స్ తదితరులు పాల్గొన్నారు.

## మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



- ఆటో కార్మికులకు సంవత్సరానికి 12వేల రూపాయల హామీని అమలు చేయాలి
- తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్

**ఇల్లందు, మే 27 (నిఘా న్యూస్):** ఐఎఫ్టియు అనుబంధం తెలంగాణ మోటార్ వర్కర్స్ యూనియన్, తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీల విలీన సమావేశం మంగళవారం ఇల్లందు ఐఎఫ్టియు కార్యాలయంలో మోటర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు డి.మోహన్ రావు అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశంలో మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎండి.రాసుద్దిన్, ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగపాణి మాట్లాడుతూ జిల్లాలో ఐఎఫ్టియు అనుబంధంగా కొనసాగుతున్న రెండు మోటార్ యూనియన్లు ఈరోజు నుండి ఒకటిగా ఉండి ఈ జిల్లాలోని మోటార్ కార్మికుల సమస్యలు,వేతన ఒప్పందాలపై భవిష్యత్తులో ఉద్యమ కార్యక్రమాలు రూపొందించుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినప్పటికీ మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు నేటికీ పాలకులు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆటో కార్మికులకు సంవత్సరానికి 12వేల రూపాయలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విలీన సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా మోత్కూరి మల్లికార్జున రావు,వర్కింగ్ ప్రెసిడెంట్ గా నరాటి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా యనగంటి రమేష్, ప్రధానకార్యదర్శిగా డి. మోహన్ రావు, సహాయ కార్యదర్శిగా మిడిదొడ్డి నాగేశ్వరరావు, కోశాధికారిగా ఎల్.మారుతీరావుతో పాటు మరో 15మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో మోటార్ ఫెడరేషన్ జిల్లా నాయకులు శరత్, రాజు లోద్, రేసు అంజయ్య, గంగారపు కోటయ్య, పాలెపు రవి, ఎన్నం నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య సిబ్బంది ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడి



### దాడికి పాల్పడిన మన్నెమ్మ కుటుంబ సభ్యులపై కేసు నమోదు

**ఉప్పల్, మే 27 (నిఘా న్యూస్):** రోడ్డుపై చిత్త వేయొద్దని చెప్పినందుకు ఓ ఇంటి కుటుంబ సభ్యులు పారిశుధ్య విభాగం సూపర్వైజర్, సిబ్బందిపై దాడి చేసిన సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం పారిశుధ్య విభాగానికి చెందిన అసిస్టెంట్ శ్రీనివాస్, సిబ్బందితో కలిసి రామ్ రెడ్డి నగర్ బైపాస్ రోడ్ లో రోడ్డుపై వేసిన చెత్తను శుభ్రం చేసిన తర్వాత అక్కడే నివసించే మణెమ్మ అనే మహిళ తన ఇంట్లో ఉన్న చెత్త అంతా తీసుకుని వచ్చి అక్కడ వేయడానికి ప్రయత్నించగా, అక్కడ చెత్త వేయవద్దని మీ ఇంటి వద్దకు వచ్చే ఆటోలోనే వేయాలని సూచిస్తూ శుభ్రం చేసిన రోడ్డుపైన చెత్త వేస్తే పెనాల్టీ విధిస్తామని ఫీల్డ్ అసిస్టెంట్ చెప్పడంతో మణెమ్మ ఆగ్రహించి ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ తో తాను అక్కడే చెత్త వేస్తానని వాగ్వాదానికి దిగింది. వాగ్వాదాన్ని అడ్డుకోబోయిన పారిశుధ్య సిబ్బంది అందరూ అక్కడ గుమికూడాటాన్ని గమనించిన మణెమ్మ భర్త యాదగిరి, కొడుకు రాము, ఇతర కుటుంబ సభ్యులు ఒక్కసారిగా వచ్చి ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ మొబైల్ ఫోన్ ధ్వంసం చేశారు. పారిశుధ్య సిబ్బంది లక్ష్మి, జానకి, దేవి, సుజాత, జంగమ్మ, అశోక్ ల పైన మూకుమ్మడిగా దాడి చేశారు. పారిశుధ్య విభాగం ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మణెమ్మ ఆమె కుటుంబ సభ్యుల పైన కేసు నమోదు చేసి ఉప్పల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో సీఎం ఫోటో పెట్టాల్సిందే

### మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి



**ముస్తాబాద్, మే 27(నిఘా న్యూస్):** ముస్తాబాద్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి ఆధ్వర్యంలో పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం కాంగ్రెస్ నాయకులం శాంతియుతంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి సీఎం రేవంత్ రెడ్డి,తెలంగాణ తల్లి చిత్రపటాలని తీసుకొని వెళుతున్న మా పై సిరిసిల్ల పట్టణానికి చెందిన బిఆర్ఎస్ నేత జిందం చక్రపాణి అనే వ్యక్తి మమ్మల్ని చంపే ప్రయత్నంగా మా మీదకి తన కారుని తీసుకొస్తే రక్షణలో భాగంగా మా కార్యకర్తలు తిరగబడ్డారని పేర్కొన్నారు. ఇది అంతా ప్రజలు గమనించారని, పోలీసులు శాంతి భద్రతలను కాపాడాలనే ఉద్దేశంతో లాటీ చార్జ్ చేయడం జరిగిందన్నారు. పోలీసుల లాటిఛార్జ్‌లో తంగళపల్లికి చెందిన ఇద్దరు కాంగ్రెస్ కార్యకర్తలకు కూడా గాయాలయ్యాయన్నారు. కావాలనే బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల్లో కేటీఆర్‌పై ఆదరణ తగ్గుతుందన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో గత 20 సంవత్సరాలుగా ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల మధ్య ఉంటూ ప్రతి ఒక్కరి సమస్య తన సమస్యగా భావించి తనకున్న పరిధిలో ప్రతి ఒక్కరి సమస్య పరిష్కరిస్తూ ప్రజల గుండెల్లో కేకే మహేందర్ రెడ్డి నిలుస్తున్నారని కొనియాడారు. ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి కేకే ను ఓర్వలేకనే బిఆర్ఎస్ నేతలు కుట్రలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ జోలికి గానికి మా కార్యకర్తల జోలికి గాని వస్తే ఊరుకునేది లేదని, బీఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు. పార్టీలకతీతంగా కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు ఏ పార్టీ తో సంబంధం లేకుండా నిజమైన అర్హులకు అందించామన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ఫోటో పెట్టాల్సిందే అని తెలిపారు. ప్రతిపక్ష నాయకులు ఇప్పటికైనా మారండి ప్రభుత్వానికి సహకరిస్తూ కేంద్రం నుండి వచ్చే నిధులను ఇప్పించే ప్రయత్నం చేసి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణి మహిళా మండల అధ్యక్షురాలు, జిల్లా నాయకులు వివిధ గ్రామ శాఖ అధ్యక్షులు బీసీ సెల్ ఎస్సీ సెల్ షా అధ్యక్షులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఉప్పల్ తొలి శాసనసభ్యుడు, టిటిడి బోర్డు మాజీ సభ్యుడు దివంగత బండారి రాజిరెడ్డి చిత్రపటానికి మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్ పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.
– హబ్సిగూడ, మే 27( నిఘా న్యూస్):

## హుజురాబాద్‌లో ఏఐఎఫ్‌డీఎస్ నూతన కార్యవర్గం

### ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడిగా బత్తుల విష్ణు




**హుజురాబాద్, మే 27 (నిఘా న్యూస్):** అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య (ఏఐఎఫ్‌డీఎస్) హుజురాబాద్ పట్టణ శాఖ నూతన కమిటీ నియామకం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా బత్తుల విష్ణు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బత్తుల విష్ణు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థుల హక్కుల సాధన, విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం ఏఐఎఫ్‌డీఎస్ కృషి చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీకాంత్, తెలంగాణ రాష్ట్ర ఏఐఎఫ్‌డీఎస్ ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు వారు అభినందనలు తెలిపి, సంఘం లక్ష్యాల సాధనలో క్రియాశీలకంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థి లోకానికి, సమాజానికి మేలు చేసే కార్యక్రమాలను చేపట్టాలని వారు ఆకాంక్షించారు.

## బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు



**లోకేశ్వరం, మే 27 (నిఘా న్యూస్):** మండలంలో మంత్రి సీతక్క పర్యటన నేపథ్యంలో బి ఆర్ఎస్ మండల నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేసి కుంటాల పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రశ్నిస్తే అరెస్టులు చేయిస్తున్నారని సీఎంపై మండిపడ్డారు. మండల వ్యాప్తంగా రైతుల వరి ధాన్యం కదలక నానా ఇబ్బందులు పడుతున్నారు. రైతులంటే పట్టింపు లేని ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. న్యాయం కోసం పోరాడితే అరెస్టు చేయడం సరికాదు ఇచ్చిన హామీలు. బిఆర్ఎస్ హయాంలో మంజూరైన అర్లి వంతెన పనులు ఇప్పటివరకు ప్రారంభించలేదు అన్నారు. అరెస్ట్ అయినవారిలో బి ఆర్ ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దిగంబర్,బి ఆర్ఎస్ మండల సోషల్ మీడియా అధ్యక్షుడు ప్రశాంత్,నాయకులు గంగాధర్,అనిల్ ఉన్నారు.

## గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్



**శ్రీకాళహస్తి, మే 27 (నిఘా న్యూస్):** తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు అదనపు ఎస్పీ రవిమనోహర్ ఆచారి ఆదేశాల మేరకు, అలాగే శ్రీకాళహస్తి డిఎస్పీ నరసింహమూర్తి పర్యవేక్షణలో శ్రీకాళహస్తి 2 టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ డి.నాగార్జున రెడ్డికి వచ్చిన గంజాయి రవాణా సంబంధిత సమాచారం ఆధారంగా ముఠాను అదుపులోకి తీసుకు న్నారు. ఒరిస్సా రాష్ట్రం నుండి తమిళనాడు రాష్ట్రం, అంబత్తూరు ప్రాంతానికి గంజాయి తరలిస్తున్న ముఠా సభ్యులు శ్రీకాళహస్తి ఎంజిఎం ఆసుపత్రి సర్కిల్ వద్ద, చెన్నై వెళ్ళే బస్ కోసం ఎదురు చూస్తుండగా, వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుండి 13 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేయబడింది. విచారణలో అరెస్టు చేసిన ముద్దాయిలపై తమిళనాడులో పలు క్రిమినల్ కేసులు ఉన్నట్లు గుర్తించబడింది. పారిపోయిన మరో ఇద్దరు నిందితుల పట్టుకునే దిశగా ప్రత్యేక బృందం ఏర్పాటు చేయబడింది. ఈ కేసులో ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన శ్రీకాళహస్తి 2 టౌన్ పోలీస్ స్టేషన్ కు చెందిన ఇన్స్పెక్టర్ డి. నాగార్జున రెడ్డిని, ఎస్ఐ పార్థసారథి ని, అలాగే సిబ్బంది బాలకృష్ణ, శ్రీనివాసులు, సుబ్రమణ్యం, నందకుమార్, ప్రవీణ్, సుధాకర్, రేగాన్ లను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు అభినందించారు.



ప్రభుత్వం భూగర్భ విద్యుత్ కేబుల్ కి అనుమతులు మంజూరు చేయడంతో అంబర్ పేట డివిజన్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ విద్యుత్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్ లోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న భూగర్భ విద్యుత్ కేబుల్ ఏర్పాటు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ త్వరితగతిన భూగర్భ విద్యుత్ కేబుల్ పనులను పూర్తిచేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడి సీనయ్య,ఏఈ శ్రీనివాస్,సబ్ ఇంజనీర్ రాజ్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆమనూరీ సతీష్, సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.

– అంబర్‌పేట, మే 27(నిఘాన్యూస్)



గోల్నాక చౌరస్తా పూర్తి చెత్త మయంగా మారింది. స్థానికులు తమ ఇండ్లలో పోగైన చెత్త వ్యర్థాలను ఇక్కడికి తెచ్చి వేస్తున్నారు. స్వచ్ఛ రిక్షాకు డబ్బులు ఇవ్వడం ఇష్టం లేని వారు చెత్తను తీసుకొచ్చి ఇక్కడ వేస్తున్నారు. నడి చౌరస్తాలో చెత్త వేయడం ద్వారా ద్విచక్ర వాహనదారులు జారిపడి ప్రమాదాలు జరుగుతాయని తెలిసిన వారు ఇక్కడే చెత్త వేస్తున్నారు. దీంతో వరంగల్ జాతీయ రహదారి నిత్యం చెత్తతో నిండి దుర్గంధ మయంగా మారింది. నడిరోడ్డుపై చెత్త వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన జిహెచ్ఎంసి పారిశుధ్య విభాగం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం గోల్నాక చౌరస్తాలో సిబ్బందితో పాటు ట్రాఫిక్ రాకపోకలను నియంత్రిస్తున్న అంబర్ పేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సిహెచ్ సుధాకర్ రావు కన్నుల ముందే ఓ వృద్ధురాలు నడి చౌరస్తాలో ప్లాస్టిక్ కవర్లో తెచ్చిన చెత్త ను వేసింది. దీంతో ఇన్స్పెక్టర్ ఇక్కడ చెత్త వేయవద్దని ఆమెను ఇన్స్పెక్టర్ సున్నితంగా మందలించారు.

– అంబర్‌పేట, మే 27(నిఘా న్యూస్):

## మదన్‌లాల్‌కు నివాళులు అర్పించిన మాజీ ఎంపీ నామ



**ఖమ్మం, మే 27 (నిఘా న్యూస్):** వైరా మాజీ ఎమ్మెల్యే,బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాణోత్ మదన్‌లాల్ మృతి తనకు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తెలిపారు.మంగళవారం ఖమ్మం నగరంలోని కవిరాజ్ నగర్ నందు ఉన్న మదన్ లాల్ నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యతో కలసి పూల మాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ,రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుండి ప్రజా సమస్యల పై పోరాటం చేసిన నాయకుడు మదన్ లాల్ అన్నారు. ఈ కార్యక్రమంలో నామ వెంట బిఆర్ఎస్ నాయకులు తాళ్లూరి జీవన్ కుమార్, వైరా బిఆర్ఎస్ రూరల్ మండల పార్టీ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, దిశా కమిటీ మాజీ సభ్యులు, మాజీ ఎంపిపి కట్టా కృష్ణార్జునరావు, మాజీ ఎంపీపీ సామినేని హరి ప్రసాద్, వైరా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, మోరంపూడి ప్రసాదరావు, గొడ్డేటి మాధవరావు, బత్తుల శ్రీను, వాకదాని కోటేశ్వరరావు, ఏదునూరి శ్రీను, పాల్వంచ రాజేష్, సరిపూడి గోపి సందేశ్, రేగళ్ల కృష్ణ ప్రసాద్, రాంబాబు, నరేష్ తదితరులు ఉన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు అవగాహన కార్యక్రమం



**బాలాపూర్, మే 27 (నిఘా న్యూస్):** బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం సమావేశం మందిరంలో నేషనల్ యాక్షన్ ఫర్ మెక్నైజ్ శానిటేషన్ ఎకో సిస్టమ్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు తాము నిర్వర్తిస్తున్న పనులలో భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పనులు చేయాలని సూచించారు. కేరళ సంస్థ జెన్ రోబోటెక్ ఈ కార్యక్రమంలో కమీషనర్ పి.సరస్వతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శానిటేషన్ సిబ్బంది రక్షణ చర్యలు, సిబ్బంది సంక్షేమం, భద్రతా పరికరాల ఉపయోగం పై అవగాహన కల్పించారు. సేఫ్టీ కిట్స్, భద్రతా పరికరాలు, ఆరోగ్య బీమా, వృత్తిపరమైన అంశాలపై చర్చించారు. సఫాయి కార్మికులకు పీపీఈ కిట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి శ్యాంసుందర్, మేనేజర్ నాగేశ్వరరావు, డిఈ వెంకన్న, ఆర్ఓ వేణుగోపాల్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ వంకాయల యాదగిరి, ఈఈ మౌనిక, శానిటేషన్ సెక్షన్ కంప్యూటర్ ఆపరేటర్ హనుమంతు, సెక్షన్ అసిస్టెంట్ భాగ్యలత, జవాన్లు, కామాటీలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

### పట్టణ ప్రాంతంలో..

# ఉపాధి హామీని అమలు చేయాలి



- ఈనెల 30న కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలి
- రాచకొండ రాములమ్మ పిలుపు

**మోత్కూరు, మే 27 (నిఘా న్యూస్):** మున్సిపాలిటీ పరిధిలో,నగర పంచాయతీలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను కల్పించాలని ఈనెల 30న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాను వ్యవసాయ కూలీలు, పేదలు పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు రాచకొండ రాములమ్మ పిలుపునిచ్చారు.మంగళవారం పట్టణంలోని సుందరయ్య కాలనీలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 30 న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కరపత్రము ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రాములమ్మ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పట్టణాలలో,నగర పంచాయతీలలో ఉపాధి హామీ పనులు పెట్టవద్దు అని లేకున్నా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు మున్సిపల్ పట్టణాల్లో,నగర పంచాయతీలలో ఉపాధి హామీ పనులను పెట్టడం లేదని అన్నారు.కేరళ రాష్ట్రంతో పాటు మరి కొన్ని రాష్ట్రాలలో పట్టణాలలో,నగర పంచాయతీలలో ఉపాధి హామీ పనులు పెడుతున్నప్పుడు మన రాష్ట్రంలో ఎందుకు పెట్ట కూడదు అని అన్నారు.

గత ఎన్నికల్లో కాంగ్రెస్ తమ ఎన్నికల హామీలల్లో అధికారంలోకి వస్తే మున్సిపల్ పట్టణాలలో ఉపాధి హామీ పనులను కల్పిస్తామని చెప్పి సం.రం గడిచిన ఎందుకు హామీని అమలు చేయడం లేదని ప్రశ్నిస్తున్నామన్నారు. చిన్న చిన్న పక్కనున్న గ్రామాలను కలిపి నగర పంచాయతీలుగా, మున్సిపాలిటీ లుగా ప్రకటించి అక్కడ ఉన్న వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులను లేకుండా చేయడంతో ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పలు గ్రామాలకు పనుల కోసం వలసలు పోవలసి వస్తుందని అన్నారు.

పేరుకే పట్టణాలు కానీ చేసుకొని బతకడానికి కూలీ మాత్రం దొరికే పరిస్థితి లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం అన్ని పట్టణాల్లో ఉపాధి హామీ పథకం పనులను ప్రారంభించి పనులు కల్పించాలని, సం.రానికి 200 రోజుల పనులు కల్పించాలని,కనీస కూలీ రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, సావిత్రి, తహెరా, మల్లమ్మ, మమత, నాగయ్య, వజ్రమ్మ, ప్రణవి తదితరులు పాల్గొన్నారు.

# వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ మృతి



కారేపల్లిలో నివాళులు అర్పించిన బీఆర్ఎస్ శ్రేణులు

**కారేపల్లి, మే 27 (నిఘా న్యూస్):** వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ మృతితో కారేపల్లి మండలం బీఆర్ఎస్ శ్రేణులలో విషాదచ్ఛాయలు నెలకొన్నాయి. మంగళవారం కారేపల్లి బస్టాంట్ సెంటర్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మదన్‌లాల్ చిత్రపటానికి ఉంచిన బీఆర్ఎస్ శ్రేణులు పూలమాలలు వేసి నివాళ్లు ఆర్పించారు.ఈ సందర్భంగా కారేపల్లి మండలానికి మదల్‌లాల్‌తో ఉన్న అనుబంధాన్ని, ఆయన చేసిన అభివృద్ధిని నాయకులు గుర్తుచేసుకున్నారు.

అభివృద్ధి కోసం మంత్రులు, ముఖ్యమంత్రుల స్థాయి నేతలతో పాటు, ఉన్నతాధికారులకు కలిసి విన్నవించే చొరవ అయనను ఉన్నతస్థాయిలో నిలిపిందని నాయకులు కొనియాడారు. ఆయన మృతి జీర్ణించుకోలేక పోతున్నట్లు వాపోయారు. కారేపల్లి క్రాస్ రోడ్‌లో మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ మృతికి నివాళ్లు ఆర్పించారు. వివిధ పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే మృతికి నివాళ్లు ఆర్పించారు.

నివాళ్లు ఆర్పించిన వారిలో తోటకూరి పిచ్చయ్య, రావూరి శ్రీనివాసరావు, హన్మకొండ రమేష్, ముత్యాల సత్యనారాయణ, అడప పుల్లారావు, నర్సింగ్ శ్రీనివాసరావు, ధరావత్ మంగీలాల్, ఉన్నం వీరేందర్, వాంకుడోత్ జగన్, షేక్ గౌసుద్దీన్, జడల వెంకటేశ్వర్లు-వసంత, ఇస్లావత్ బన్సీలాల్, తాత వెంకటేశ్వర్లు, ముత్యాల వెంకట అప్పారావు, కొండెబోయిన నాగేశ్వరరావు, కే.నరేంద్ర, తలారి చంద్ర ప్రకాష్, పగడాల మంజుల, బానోతు దేవ్లానాయక్, పెద్ద బోయిన ఉమాశంకర్, గుగులోతు చిన్న నాయక్. మాలోత్ శకుంతల-కిషోర్, బానోతు పద్మావతి, ఇమ్మడి తిరుపతిరావు-రమాదేవి, వై.ప్రకాష్, జానకి సంతాపాన్ని వ్యక్తం చేశారు.

# పంపిణికి సిద్ధంగా పచ్చి రొట్ట విత్తనాలు



**కారేపల్లి, మే 27(నిఘా న్యూస్):** వానకాలంలో ఎరువులుగా దుక్కులలో వేసే పచ్చిరొట్ట విత్తనాలు పంపిణికి సిద్ధంగా ఉన్నాయని కారేపల్లి మండల వ్యవసాయాధికారి బట్టు అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం కారేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ రైతులకు సబ్సిడీపై జీలుగులు, జనుము, నాన్ సబ్సీడీపై వరి విత్తనాలు పంపిణికి సిద్ధంగా ఉన్నాయన్నారు. జిలుగులు 250 క్వింటాలు, జనుము 50 క్వింటాలు, వరి 25 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జీలుగులు 30 కేజీల బస్తా 50 శాతం సబ్సిడీ పోను రూ.2137.5 లకు, జనుము 40 కేజీల బస్తా 50 శాతం సబ్సిడీపై రూ.2510 లకు లభిస్తుందన్నారు. వరి బీపీటీ- 5204 రకం 25 కేజీల బస్తా రూ.1075కు లభిస్తుందన్నారు. కావలసిన రైతులు తమ వెంట పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్ జిరాక్స్ తీసుకొని అయా ప్రాంతాల ఏఈవోలను సంప్రదించాలన్నారు. మాదారం,గేటు కారేపల్లి, కమలాపురం రైతులు ఏఈవో చంద్రకళ, సెల్ 9281037126, ఉసిరికాయలపల్లి రైతులు ఏఈవో ప్రమీల, సెల్ 9281037130, కోమట్లగూడెం, విశ్వనాథపల్లి రైతులు ఏఈవో మహేష్, సెల్ 9281037127, సింగరేణి, పేరుపల్లి రైతులు ఏఈవో మున్ని, సెల్ 9281037129, మాణిక్యారం, రేలకాయలపల్లి, బాజుమల్లాయిగూడెం రైతులు ఏఈవో నరేష్, సెల్ 9281037128 సంప్రదించి కూపన్ తీసుకోవాలన్నారు. కూపన్లతో కారేపల్లి సొసైటీ ని సంప్రదించి పచ్చిరొట్ట విత్తనాలకు పైకం చెల్లించి తీసుకోవాలని ఏవో కోరారు.

# సర్కార్ బడులలో నాణ్యమైన విద్య



కారేపల్లిలో యూటీఎఫ్ ప్రజాజాత

**కారేపల్లి, మే 27 (నిఘా న్యూస్):** సర్కార్ బడులలో ప్రయివేటుకు ధీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని టీఎస్‌యూటిఎప్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి డీఎస్. నాగేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు లక్ష్యంగా యూటీఎఫ్ చేట్టిన ప్రజా చ్కెతన్య జాత మంగళవారం కారేపల్లికి చేరుకుంది. మండలంలోని ఎర్రబోడు, మాణిక్యారం గ్రామాలల్లో తల్లిదండ్రులకు సర్కార్ బడులలో అందుతున్న విద్య, ఉచిత సౌకర్యాలను వివరిస్తూ ప్రజాజాత సాగింది. ఈసందర్బంగా కారేపల్లి బస్టాండ్ సెంటర్ జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ సర్కార్ బడులలో క్వాలీఫైడ్ ఉపాధ్యాయులు, కంప్యూట్ విద్యాభోధన, మధ్యాహ్న భోదనం, అల్పాహారం, పాఠ్యపుస్తకావు, యూనిఫామ్ వంటి అనేక సౌకర్యాలు కల్పించటం జరిగిందన్నారు. తల్లిదండ్రుల మద్దతుతో అద్భుత ఫలితాలు రాబట్టవచ్చన్నారు. కారేపల్లి మండలంలో ప్రభుత్వం పాఠశాలలు పదిలో నూరు శాతం ఫలితాలు సాధించి సత్తాచాటాయన్నారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు జిల్లా కార్యదర్శి పి.సురేష్, కామేపల్లి మండల అధ్యక్షులు నల్లమోతు శ్రీనివాసరావు, సింగరేణి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.మంగీలాల్, కృష్ణారావు, నాయకులు సంతులాల్, ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గోల్నాక డివిజన్ శ్యాంనగర్, సుందర్ నగర్ బస్తీలలో మంగళవారం అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పర్యటించి ప్రజాసమస్యలు తెలుసుకున్నారు. బస్తీవాసుల విజ్ఞప్తి మేరకు సిసి రోడ్లు, స్ట్రీట్ లైట్లు, మంచినీటి పైప్ లైన్ త్వరలో ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

– అంబర్‌పేట, మే 27(నిఘా న్యూస్):




ఆర్యవైశ్య సంఘం అంబర్ పేట ప్రేమ్ నగర్ ఆధ్వర్యంలో అమావాస్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రవీందర్, ఉపాధ్యక్షుడు జూలూరి తిరుపతి గుప్తా చైర్మన్ హరిబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

– అంబర్‌పేట, మే 27(నిఘా న్యూస్):

## తూప్రాన్ ప్రధాన రహదారిపై అక్రమ పార్కింగ్

### తరచూ ట్రాఫిక్ జామ్, పట్టించుకోని పోలీసులు





**తూప్రాన్, మే 27 (నిఘా న్యూస్):** మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలోని ప్రధాన రహదారి ట్రాఫిక్ జామ్ తో గత కొంత కాలంగా మంగళవారం రోజున పూర్తిగా అంతరాయం ఏర్పడి వాహన దారులకు, పాదాచారులకు, స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, మంగళవారం సంత కావడంతో పూర్తిగా రోడ్డుపైన వ్యాపారాలు సాగిస్తున్నారు. ఆటోదారులు, ద్విచక్ర వాహనాలను వారి వాహనాలను రోడ్లపై నిలుపుదల చేస్తున్నారు. పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి, పోలీసుల దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం శూన్యం ఇకమీదట మంగళవారం రోజున ప్రధాన రహదారిలో అంతరాయం ఏర్పడకుండా పోలీసులు, మున్సిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి వాహనదారులు, పాదచారులకు, పిల్లలకు అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపట్టాలి.

## ఉప్పల్ ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి సహకారం : మంత్రి శ్రీధర్ బాబు



**ఉప్పల్, మే 27(నిఘా న్యూస్):** ఉప్పల్ ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి తన వంతు తోడ్పాటు అందిస్తానని ఐటీ శాఖ మంత్రి, మేడ్చల్ జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ సమస్య పరిష్కారానికి సహకారం అందిస్తామని తెలిపారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించడంతో పాటు, జర్నలిస్టుల ఇండ్ల పట్టాల సమస్యల పరిష్కరించాలని కోరుతూ టి యు డబ్ల్యూ జే మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మంత్రి శ్రీధర్ బాబును మంగళవారం రాష్ట్ర సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబుతో పాటు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జర్నలిస్టుల ఇళ్ల పట్టాలు, ఇతర అంశాలపై చర్చించారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి నిధుల మంజూరుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. జర్నలిస్టులకు అండగా ఉంటూ జర్నలిస్టులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్టుల పాత్ర ముఖ్యమైనది అన్నారు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలిచే జర్నలిస్టుల కు తగిన సహకారం ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజ్ , ప్రధాన కార్యదర్శి దొంతుల వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పైపులు వేసి దిమ్మెలు నిర్మించడం మరిచారు



**తూప్రాన్ మే 27 (నిఘా న్యూస్):** తూప్రాన్ మండల సమీపం మాసాయిపేట స్టేషన్ నుంచి వెంకటయపల్లి వరకు నూతనంగా నిర్మించిన రోడ్డులో చెరువు కాలువల వద్ద పైపులు వేసి దిమ్మెలు కట్టడం మరిచిపోయిన వైనం.దాతర్ పల్లి సమీపంలో రోడ్డు కింది భాగంలో నీటికి కావలసిన పైపులను వేశారు కానీ దిమ్మెలు కట్టక కపోవడంతో నిర్మించిన రోడ్డు పూర్తిగా వర్ష తాకిడికి ధ్వంసం అవుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. దాతర్ పల్లి సమీపంలో ఇలాంటివి చోటు చేసుకోవడంతో గ్రామస్తుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవడంతో తక్షణమే ఉన్నత అధికారులు, కాంట్రాక్టర్లు దిమ్మెలను నిర్మించాలని స్థానికులు తెలిపారు.



## లోకేశ్వరం నుండి రాజుర వరకు నూతన రోడ్డు నిర్మించండి

### సీతక్కకు వినతిపత్రం అందజేసిన మండల నాయకులు

**లోకేశ్వరం, మే 27 (నిఘా న్యూస్):** మండలం నుండి రాజుర వరకు నూతన రోడ్డు నిర్మించాలని తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్కకు కాంగ్రెస్ నాయకులు మండల అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ రత్నాకర్ రావు,సోషల్ మీడియా అధ్యక్షుడు లోకేశ్వర్ మండల్ సాయి ప్రసాద్, ముధోల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు షఫీ, నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లోకేశ్వరం మండల కేంద్రం నుండి రాజుర వరకు రాజుర నుండి మన్మద్ ఎక్స్ రోడ్ వరకు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని వాహన రాకపోకలకు ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారని ప్రజల సమస్యలను తీర్చాలని మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు.

## ప్రైవేటుకు దీటుగా... ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు

### జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్



**వికారాబాద్, మే 27 (నిఘా న్యూస్):** నూతనంగా నిర్మాణమైన జనరల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు వైద్య సేవలు అందించడం ప్రారంభించడం జరుగుతుంది కావున. సంబంధిత డాక్టర్లు అంకిత భావంతో విధులు నిర్వహించాలని జిల్లా పాలన అధికారి ప్రతిక్ జైన్ సూచించారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా పాలన అధికారి ప్రతిక్ జైన్ అధ్యక్షతన వైద్య విద్య కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున్, ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రామచంద్రయ్య, డి సి హెచ్ ఎస్ డాక్టర్ ఆనంద్, సంబంధిత డాక్టర్ల బృందంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన ఆరోగ్య కేంద్రంలో రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించరాదని సూచించారు. ఇంకా ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు కావలసి ఉంటే నివేదిక పంపాలని వెల్లడించారు. ఆస్పత్రిలోని ప్రతి వైద్య విభాగంలో నెంబర్ సంఖ్యలతో సహా,సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. జిల్లా పాలన అధికారి ప్రతిక్ జైన్ నూతన జనరల్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు.

## జాబ్ మేళాను యువత వినియోగించు కోవాలి

### సొసైటీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్



**తాండూరు, మే 27 (నిఘా న్యూస్):** తాండూరు ఎమ్మెల్యే బి. మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన తాండూరు పట్టణ కేంద్రంలోని వినాయక కన్వెన్షన్ హాల్లో వివిధ ప్రవేట్ కంపెనీల వారితో జాబ్ మేళా నిర్వహించి, 10వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడం జరుగుతుంది కావున మండల పరిధిలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్ కోరారు. చదువుకున్న యువత ప్రభుత్వ ఉద్యోగమే కావాలని ఎదురు చూడకుండా ప్రైవేటు ఉద్యోగాలలో భర్తీ కావాలని కోరారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు అతిపెద్ద జాబ్ మేళా నిర్వహించడానికి కృషి చేసిన ఎమ్మెల్యే బి. మనోహర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

## మచ్చ బొల్లారం డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి

### కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్



**అల్వాల్, మే 27 (నిఘా న్యూస్):** మచ్చ బొల్లారం డివిజన్ సమగ్రాభివృద్ధికి తన శాయశక్తుల కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. మంగళవారం మచ్చ బొల్లారం డివిజన్ పరిధిలోని సత్యం కాలనీలో 26 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్ట బోయే సిసి రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆశీస్సులతో మచ్చ బొల్లారం డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తాన్నట్లు ఆయన చెప్పారు. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, మురికి వాడలలో మౌలిక వసతులను కల్పి స్తానని తెలిపారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నానన్నారు. అభివృద్ధి లో ఆదర్శ డివిజన్ గా మచ్చబొల్లారాన్ని తీర్చి దిద్దటమే తన ఏకైక కర్తవ్యం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, నాయకులు శ్రీశైలం యాదవ్, స్వామి, దేవేందర్, వెంకటేష్, కాలనీ వాసులు విజయ్ కృష్ణ, శ్రీకాంత్, జగదీశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, తిరుమలయ్య, ఆనంద్, రాజిరెడ్డి, అనిల్ రెడ్డి, లావణ్య, విజయ లక్ష్మి, వెన్నెల, యమున, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

### కూలీల సమస్యల సాధనకు.. మే 30న జరిగే...


# కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయండి

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి



వలిగొండ, మే 27(నిఘా న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఉపాధి హామీ చట్టరక్షణకై కూలీల సమస్యల సాధనకై డిమాండ్ చేస్తూ ఈ నెల 30న జరిగే కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి,జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని పులిగిల్ల, కేర్చిపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశంలో జరిగిన కూలీల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పేదలు,వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్య పోరాటం తోపాటు వామపక్షాల ఒత్తిడి మేరకు యూపీఏ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి వందరోజుల పని గ్యారంటీ కోసం తీసుకొచ్చిన గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సాధిస్తే నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం చట్టాన్ని సక్రమంగా అమలు చేయకుండా నిధులను క్రమక్రమంగా తగ్గిస్తూ ఎత్తివేయాలని కుట్ర చేస్తుందన్నారు. గత సంవత్సరం 2.50 లక్షల కోట్ల రూపాయలు కేటాయించాల్సి ఉండగా 90 వేల కోట్లు ఖర్చు చేసిన పాలకులు ఈ సంవత్సరం 86 వేల కోట్ల రూపాయలకు తగ్గించిందన్నారు. దీంతో కూలీల జాబ్ కార్డులు, పని దినాలు పెద్ద ఎత్తున తగ్గించడం జరుగుతుందన్నారు. పథకం ప్రారంభంలో 2005 సంవత్సరంలో కూలీలందరికీ పనిముట్లు గడ్డపార పార తట్ట గొడ్డలి లాంటివి ఇస్తామని చెప్పి కేవలం కొద్ది మంది కూలీలకు ఇచ్చి గత పది సంవత్సరాలుగా కూలీలకు పనిముట్లు ఇవ్వడం లేదని అన్నారు. పనిచేసే చోట టెంటు మంచినీళ్లు ఏర్పాటు చేయడం లేదని వారం వారం రావలసిన కూలీ డబ్బులు 5,6 వారాలుగా పెండింగ్ లోనే ఉంటున్నాయని దీంతో కూలీలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని అన్నారు ప్రభుత్వం నిర్ణయించిన 307రూపాయలు ఎవరికి అందని పరిస్థితిలో ఏర్పడ్డాయని కేవలం 150 నుండి 200 కు మించడం లేదని కొలతలను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పే స్లిప్పులు ఇవ్వక పోవడంతో కూలీలు తమకు ఎంత కూలి చెల్లిస్తున్నారో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఈ సమస్యల పరిష్కారం కోసం దిగి వచ్చే విధంగా ఈనెల 30 న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తున్నామని ఈ ధర్నాలో కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని తమ డిమాండ్ల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశాల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు దొడ్డి బిక్షపతి, కెవిపిఎస్ మండల అధ్యక్షులు వేముల అమరేందర్,రైతు సంఘం మండల నాయకులు కొమ్మిడి సత్తిరెడ్డి,కూలీలు చిన్నం అంజమ్మ, అలివేలు, పద్మమ్మ, నరసింహ, అండాలు,యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో వరంగల్‌లో సిజిహెచ్ఎస్ వెల్‌నెస్ కేంద్రం



**వరంగల్, మే 27 (నిఘా న్యూస్):** వరంగల్‌లో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు విజ్ఞప్తి చేశారు. గత పార్లమెంట్ సమావేశాల్లో సైతం వరంగల్‌లో వెల్ నెస్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ త్వరలోనే వరంగల్ సెంటర్ ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలియజేశారని ఎంపీ వివరించారు. వరంగల్‌తో సహా దేశవ్యాప్తంగా 22 కొత్త సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్లను ప్రారంభించేందుకు ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపినట్లు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యకు అదనపు కార్యదర్శి రోలీసింగ్ లేఖ రాసారు. ఈ సెంటర్ల పనితీరును ప్రారంభించేందుకు అవసరమైన పోస్టుల సృష్టికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ డీఓపీటీ నుండి ఆమోదం లభించిందని లేఖలో పేర్కొన్నారు. అయితే, ఈ ప్రతిపాదనను ఆర్థిక అనుమతి కోసం ఆర్థిక మంత్రిత్వ శాఖలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండిచర్ డీఓఈకు పంపగా, కొన్ని వివరణలు కోరుతూ ఫైల్ పంపారని ఎంపీకి అదనపు కార్యదర్శి వివరించారు. ప్రస్తుతం ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ స్పష్టీకరణలపై పనిచేస్తోందని ఈ విషయం పరిశీలనలో ఉందని పేర్కొన్నారు. వరంగల్‌లో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ ద్వారా వైద్య చికిత్సలు, వ్యాధి నిర్ధారణ తదితర సదుపాయాలు కలగడంతో ఉద్యోగులకు, పెన్షనర్లకు ఉద్యోగ కుటుంబాలకు వైద్య ఆరోగ్య సంబంధిత సౌకర్యం లభిస్తుందని తెలియజేశారు. జిల్లాలో వెల్‌నెస్ సెంటర్ కొరకు కృషి చేస్తున్న ఎంపి డా. కడియం కావ్యకి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## టైం టెక్నో కంపెనీ ముందు కార్మికుల ధర్నా




మేడ్చల్, మే 27(నిఘా న్యూస్): మేడ్చల్ మండల పరిధిలోని టైమ్ టెక్నో కంపెనీలో 8 గంటల పనివిధానం కొనసాగించాలని 12గంటలు పని చెయ్యమని కంపెనీ కార్మికులు కంపెనీ గేటు ముందు కూర్చొని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏర్రా అశోక్ మాట్లాడుతు కంపెనీ యజమాన్యం కాంట్రాక్టర్లు కలిసి బలవంతంగా 12 గంటల పని విధానాన్ని కొనసాగించాలని కార్మికులను బలవంతం చేయడం తోని కంపెనీ బయట ధర్నాకు కూర్చోవడం జరిగింది అని అన్నారు. టైం టెక్నో కంపెనీలో డ్రమ్ములు సందర్భంలో వేడితోని కలిసి పనిచేయాల్సిన పరిస్థితి ఉంటుంది అలాంటి సందర్భంలో 12 గంటల పని చేయడం అనేది సాధ్యమయ్యేటువంటి పని కాదని దానివల్ల కార్మికునికి ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని అన్నారు. కంపెనీ యజమాన్యం వెంటనే చర్చలు జరపాలని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.

కంపెనీ యజమాన్యం తోని ఒక దప చర్చలు జరిగిన చర్చలు విజయవంతం కాలేదని రేపు తిరిగి ఉదయం 11 గంటలకు మరోసారి చర్చలు ఉంటాయని ఈ చర్చల్లో కంపెనీ యజమాన్యం, కాంట్రాక్టర్లు, సిఐటియు నాయకులు, కార్మికులతోని ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ నరేష్, కంపెనీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు




**చింతూరు, మే 27(నిఘా న్యూస్):** భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) చింతూరు సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం 3 సచివాలయం ల వద్ద ఏజెన్సీ ప్రాంత ఆదివాసి నిరుద్యోగులకు 100 శాతం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని నిరసన కార్యక్రమం తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు సీసం సురేష్. పోడియం లక్ష్మణ్. మల్లం సుబ్బమ్మ. మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏజెన్సీ నిరుద్యోగులకు ఆదివాసులకు 2020లో రద్దయిన జీవో నెంబర్ 3 స్థానంలో మేము అధికారం కు వస్తే ఆదివాసులకు 100 శాతం ఉద్యోగ ఉపాధి రిజర్వేషన్ కల్పించే విధంగా మా ప్రభుత్వం ద్వారా ఆదివాసులకు న్యాయం చేస్తామని ఆరోజు ఎన్నికల హామీ ఇచ్చి ఉన్నారన్నారు. కానీ మెగా డీఎస్సీ ప్రకటనలో ఏజెన్సీ ఉపాధ్యాయ నియామకల్లో ఎస్టీ జనరల్ రిజర్వేషన్ 06 శాతం మాత్రమే అమలు చేయడం. అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా 30 ఉపాధ్యాయులు రిజర్వ్ చేయబడినవి. ఎన్నికల సందర్భంగా ఆదివాసులకు ఇచ్చిన 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్ అమలుపై ఎలాంటి నిర్ణయం చేయకపోవడం ఆదివాసులు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. కావున ఐదవ షెడ్యూల్ ఏరియా 1/70 చట్టం అమలు ఏజెన్సీ ఆదివాసులకి నిరుద్యోగులకు ప్రత్యేకంగా ఉపాధి అవకాశాలను కల్పించేందుకు రాజ్యాంగంలో పొందుపరిచిన విధంగా 100 శాతం ఉద్యోగ అవకాశాలు ఎస్టీలకు రిజర్వేషన్ కల్పిస్తూ జీవో ను వెంటనే విడుదల చేయాలని అన్నారు. మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులను మినహాయింపు ఇవ్వాలి. స్థానిక ఆదివాసులకు 100 శాతం ఉద్యోగ ఉపాధ్యాయ రిజర్వేషన్ పునరుద్ధరణ చెయ్యాలి. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు అమలు చేయాలని అన్నారు. సమస్యలతో కూడిన వినతిపత్రంను సచివాలయ ఇన్చార్జి కి వ్వడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ ఈ సమస్యలన్నీ కూడా మా పై స్థాయి అధికారులకు తెలియజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు సవలం కన్నయ్య. నాయకులు పాండు సుబ్బారావు. పాండు నాగార్జున్. కూర భీమయ్య. కనితి సమ్మయ్య. శ్యామల తమ్మయ్య. తదితరులు పాల్గొన్నారు.

## మన్న మందిరాలకు నిధులు కేటాయించండి

### మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేసిన సంఘ నాయకులు



**లోకేశ్వరం, మే 27 (నిఘా న్యూస్):** మండల కేంద్రమైన లోకేశ్వరంలో కొమరం భీం విగ్రహావిష్కరణకు విచ్చేసిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి సీతక్కకు ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్‌కు సంఘ భవనాలు, భీమన్న దేవుని ఆలయ నిర్మాణాలకు నిధులు కేటాయించాలని వినతి పత్రం అందజేసిన మండల సంఘ సభ్యులు అధ్యక్షులు రాజేశ్వరరావు.ఉపాధ్యక్షులు గంజాల గంగాధర్.సంయుక్త కార్యదర్శి మండలం కామిండ్ల భోజన్న తదితరులు ఉన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**మేడ్చల్, మే 27(నిఘా న్యూస్):** మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2006-07 బ్యాచ్ కి చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం స్కూల్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు 18 సంవత్సరాల తర్వాత మొదటిసారి కలుసుకొని ఒకరిని నోకరు ఆప్యాయంగా పలకరించుకొని ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా జ్యోతి ప్రజ్వలన గావించి ఆనాటి ఉపాధ్యాయులను శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## సబితమ్మ చొరవతో సమస్యకు పరిష్కారం



**పహాడీషరీఫ్, మే 27(నిఘా న్యూస్):** జల్ పల్లి గ్రామంలో గత కొంతకాలంగా నెలకొన్న మురుగునీటి సమస్యకు మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చొరవతో పరిష్కారం లభించిందని టిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు యంజాల అర్జున్ తెలిపారు. మంగళవారం కమీషనర్ వెంకట్రావు ఆయనతో కలిసి కాలనీలో పర్యటించారు. డ్రైనేజ్ మరమ్మత్తుల పనులను పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ శివ రామాంజనేయ స్వామి ఆలయ పరిసరాలలో నెలకొన్న మురుగునీటి సమస్యను తెలుసుకున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారన్నారు. బీఆర్ఎస్ నాయకులు సూరెడ్డి కృష్ణారెడ్డి, యంజాల అర్జున్, ఎమ్మార్పీఎస్ నాయకుడు శివకుమార్ తదితరులు రోడ్డు దిగువన ఉన్న వెంచర్ వద్ద నెలకొన్న సాంకేతిక సమస్యపై అక్కడి ప్రజలతో చర్చించి పైప్ లైన్ వేసేందుకు మార్గం సుగమం చేశారన్నారు. అందరి సమ్మతంతో మంగళవారం పైప్లైన్ పనులను ప్రారంభించారన్నారు. కార్గో రోడ్డు వద్ద ఉన్న అవుట్ లెట్ వరకు పైప్ లైన్ వేస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్ పేర్కొన్నారు.

## జల్పల్లిలో కాలుష్య కారక పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి



**పహాడీషరీఫ్, మే 27(నిఘా న్యూస్):** జల్పల్లి మున్సిపాలిటీలో కాలుష్యం కలిగించే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని జల్పల్లి మున్సిపాలిటీ టీఆర్ఎస్ అధ్యక్షుడు షర్ఫుద్దీన్ హామెద్ అన్నారు. జల్పల్లి మున్సిపాలిటీ పరిధిలో నడుస్తున్న అనుమతులు లేని అక్రమ పరిశ్రమల, కాలుష్యం కలిగించే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని టిఆర్ఎస్ పార్టీ తరపున కమిషనర్ వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా షర్ఫుద్దీన్ హామెద్ మాట్లాడుతూ అక్రమంగా నిర్వహించే పరిశ్రమల నుంచి, కాలుష్యం విపరీతంగా వెదజల్లడంతో స్థానిక ప్రజల ఆరోగ్యానికి, శ్వాసకోశ సమస్యలు, నీటి కాలుష్యం ఇతర ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. పర్యావరణానికి తీవ్రమైన ముప్పును కలిగిస్తున్నాయన్నారు. జల్పల్లి మున్సిపాలిటీలోని కొన్ని ప్రాంతాలలో సంబంధిత అధికారుల నుండి అనుమతులు లేని పరిశ్రమలు చట్టవిరుద్ధంగా నడుస్తున్నాయన్నారు. సమస్యను తీవ్రంగా పరిగణించి, 30రోజులు లోపల తగిన చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే టిఆర్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

## వలస ఆదివాసీ గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు




చింతూరు, మే 27(నిఘా న్యూస్): వలస ఆదివాసీ ప్రాంతాల్లో బాలల ప్రాథమిక సంరక్షణ, అభివృద్ధిని బలోపేతం చేయడంలో ముందడుగు వేస్తూ, సమారిటన్స్ ఫర్ ది నేషన్ ఆధ్వర్యంలో పుంగుట్ట, పాత వినాయకపురం, ఆముదలపేట గ్రామాల్లో మూడు నూతన అంగన్వాడీ కేంద్రాలు విజయవంతంగా ప్రారంభించారు. వీటి నిర్మాణం కోసం రూ. 2.2 లక్షలు వెచ్చించారు. ఈ అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, తల్లులకు ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక విద్య వంటి సేవలను మరింత సురక్షితమైన, సరైన వాతావరణంలో అందించేందుకు ఉపయోగపడతాయని సర్పంచ్ పాయం చంద్రయ్య కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ రామ్ కుమార్ బృందం, స్థానిక సర్పంచ్ పాయం చంద్రయ్య , ఐసిడిఎస్ సిబ్బంది, గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నా రు.

# శవాలకున్న హక్కులను కాలరాసిన బిజెపి

- ఏన్ కౌంటర్లన్ని ప్రభుత్వ హత్యలే..!
- రాజకీయ పార్టీల ప్రజాసంఘాల పౌర హక్కుల ఆధ్వర్యంలో నిరసన



**షాద్‌నగర్, మే 27(నిఘా న్యూస్):** ప్రస్తుతం దేశంలో మావోయిస్టులపై చేస్తున్న ఎన్ కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్య లేనని పలు రాజకీయ పార్టీలు ప్రజాసంఘాల పౌర హక్కుల సంఘాల నేతలు కేంద్ర ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం ముందు రాజకీయ పార్టీలు ప్రజాసంఘాలు పౌర హక్కుల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లక్ కార్డులు చేతబట్టి నిరసనకు దిగారు. ఈ దేశ మూల వాసులైన ఆదివాసులపై ఆదివాసుల హక్కులను హరించే విధంగా మావోయిస్టుల పేరుతో ఆదివాసులతో పాటు మావోయిస్టులను హత్యలు చేస్తూ ఎన్కౌంటర్లో మృతి చెందిన మృతదేహాలను బంధువులకు ఇవ్వకుండా రాజ్యాంగా స్ఫూర్తికి విరుద్ధంగా బిజెపి పార్టీ పాలన కొనసాగిస్తుందని వెంటనే ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలని కోరారు. ఆదాని అంబానీల కోసమే ఆపరేషన్ కగార్ పేరుతో బిజెపి ప్రభుత్వం అత్యంత పాషవీకంగా మావోయిస్టుల పైన ఆదివాసుల పైన హత్యకాండను కొనసాగిస్తుందని దీన్ని విరమించు కోవాలని మావోయిస్టులను అంతం చేయడం అమిత్ షా తరం కాదన్నారు. ఇలాగే వ్యవహరిస్తే ప్రజల నుండి తీవ్రమైన తిరుగుబాటు మొదలవుతుందని కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ అమిత్ షా గుర్తించు కోవాలన్నారు.

వ్యక్తులను చంపవచ్చు కానీ వారి ఆలోచనలు వారి ఆశయాన్ని చంపలేరని ఈనెల 21వ తేదీన జరిగిన బూటకపు ఎన్కౌంటర్లో 27మంది మావోయిస్టులను చంపివేశారని ఆ ఎన్ కౌంటర్ లో కేశంపేట మండలం వేముల్ నర్వ గ్రామానికి చెందిన విజయలక్ష్మి అలియాస్ (భూమిక) మరణించిందని చివరికి వారి శవాలను కూడా బంధువులకు ఇవ్వకుండా పోలీసులే కాల్చివేయడం ఎంతవరకు సమంజసం అని శవాలకు కూడా హక్కులు ఉంటాయని అనేది బిజెపి పాలకులు గుర్తించు కోవాలన్నారు. ఈ దేశంలో బిజెపి ప్రభుత్వం జీవించే హక్కును కూడా కాలరాస్తుందని దేశాన్ని ఓవైపు కొల్లగొడుతున్న ఆదా నీ అంబానీలతో పాటు కార్పొరేట్ శక్తులకు కొమ్ముగాస్తూ పేద ప్రజలపై పేద ప్రజల కోసం పోరాడుతున్న ఆదివాసులపైన మావోయిస్టులపైన ప్రజాస్వామిక వాదుల పైన హత్యకాండను కొనసాగిస్తుందన్నారు. బిజెపి ప్రభుత్వం చేస్తున్న ఈ హత్యకాండను వెంటనే మానుకోవాలన్నారు. లేదంటే భవిష్యత్తులో బిజెపి ప్రభుత్వానికి మోడీ అమిత్ షాకు బుద్ధి చెప్పాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తిరుమలయ్య, బిఆర్ఎస్ నాయకులు మాజీ కార్పొరేషన్ చైర్మన్ రాజా వరప్రసాద్, కార్మికసంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్, ఆదివాసి గిరిజన కాంగ్రెస్ రాష్ట్రకో ఆర్డినేటర్ పి.రఘు, బిఆర్యెస్ నాయకులు వెంకటేష్ గౌడ్, బీఎస్పీ పార్టీ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ దొడ్డి శ్రీనివాస్ సిపిఎం నాయకులు ఈశ్వర్ నాయక్ ప్రజా సంఘాల నాయకులు అర్జునప్ప జనార్ధన్ గౌర్ల రాముబాల్ రాజ్ మందారం నరసింహులు శ్రీను రాంచందర్ రాములు రవి కుమార్ నరసింహులు గౌడ్ ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఆకాష్ నాయక్ ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కస్తూరి జింకల అవశేషాల స్వాధీనం

### దర్యాప్తు నిమిత్తం సిసిఎంబి కి పంపిన ఫారెస్ట్ అధికారులు

**అశ్వారావుపేట మే 27 (నిఘా న్యూస్):** అశ్వారావుపేట మండలం వినాయకపురంలో నివసిస్తున్న ఎస్.కె అబ్దుల్ హాఫీస్ ఇంట్లో అరుదైన జంతువుల అవశేషాలున్నాయని అటవీశాఖ అధికారులకు సమాచారం అందింది. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్వో) మురళి నేతృత్వంలో అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక బ్యాగులో చిన్న బంతుల్లా కనిపించే 13 అవశేషాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఇవి కస్తూరి జింకకు సంబంధించిన అవశేషాలేనా అన్న విషయంపై అధికారులు నిర్ధారణకు రావాల్సి ఉందని తెలిపారు. మార్కెట్లో వీటికి ఉన్న భారీ డిమాండ్ వల్ల వీటి విలువ చాలా ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ అవశేషాలకు సంబంధించి మరింత స్పష్టత కోసం హైదరాబాద్‌లోని సీసీఎంబీ (సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ)కి పంపారు. వాటిని అబ్దుల్ హాఫీజ్ ఎక్కడ నుంచి సేకరించాడు, ఎందుకు సేకరించాడు, ఇందులో ఎవరి ప్రమేయమైనా ఉందా అన్న కోణంలో విచారిస్తున్నామని పేర్కొన్నారు. నిందితుడు పరారీలో ఉన్నాడన్నారు.

## మహానాడుకు హాజరైన టిడిపి రాష్ట్ర కార్యదర్శి పుష్పావతి



**తిరుపతి, మే 27 (నిఘా న్యూస్):** కడపలో మూడు రోజులపాటు జరుగుతున్న తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమానికి తిరుపతికి చెందిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పుష్పవతి యాదవ్‌తో పాటు ఆమె అనుచరులు మంగళవారం భారీగా కడప కొత్తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పుష్పావతి యాదవ్ మాట్లాడుతూ మహానాడుకు వస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రతినిధులతో పాటు భారీగా తరలివస్తున్న జనంతో చూస్తుంటే మరో 20 ఏళ్లు తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని ఆమె సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఏడాది పాలన పూర్తి అయిన సందర్భంగా రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోందని, ప్రజలు రాష్ట్ర వ్యాప్తంగా ఆనందాన్ని వెళ్ళబుచుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కెవి రమణ, యూనిట్ ఇంచార్జ్ ప్రకాష్ యశోద వైష్ణవి నారాయణ విశ్వనాథ్ పాల్గొన్నారు.

## మహానాడులో పాల్గొన్న టీడీపీ బీసీ నేతలు



**తిరుపతి, మే 27 (నిఘా న్యూస్):** కడప జిల్లాలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ మహానాడు సభలో తిరుపతి బీసీ నాయకులు రాష్ట్ర సాధికార కమిటీ సభ్యులు తన మిత్ర బృందంతో కలిసి మహానాడు సభలో పాల్గొన్నారని ఆ ప్రకటనలో తెలిపారు. ఈ మహానాడు సభకు తిరుపతి జిల్లా నుంచి చిత్తూరు జిల్లా నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే 29వ తేదీన జరగబోయే భారీ బహిరంగ సభకు బీసీ కులాల నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని, బీసీలకు ప్రత్యేక స్థానం హెూదాను కల్పించిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, అలాగే జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు ఇస్తున్న ప్రాధాన్యతను మనం కాపాడుకోవాలని బీసీ కులాలు అందరూ ఐకమత్యంతో మహానాడు సభను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగన్నాథం మిత్రబృందం శ్యాం బోల హరి, శంకర, రామారావు, ఆముదాల తులసీదాసు తదితరులు మహానాడు సభలో పాల్గొన్నారని తెలిపారు.

## పెబ్బేరు తాసిల్దార్ కార్యాలయంలో పైరవీ కారుల రాజ్యం

### నూతన తాసిల్దార్ దృష్టి సారించాలి



**పెబ్బేరు, మే 27 (నిఘా న్యూస్):** వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం తాసిల్దార్ కార్యాలయం పైరవీ కారులకు అడ్డాగా మారిందని సమాచారం. ఈ కార్యాలయంలో ఏ పని అయినా సరే, పైరవీ కారుల ద్వారానే జరుగుతుందని, ఏ ఫైలు కదలాలన్నా వారి ద్వారానే నడుస్తుందని తెలుస్తోంది. భూమి రిజిస్టర్ దస్త్రాలు, ఇతర ఏదైనా ఫైల్ అయినా పైరవీ కారుల ద్వారానే నడుస్తుందని సమాచారం. ఆఖరికి కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ లకు కూడా పైరవకారులే చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సామాన్య ప్రజలు పోతే దినాలు గడుపుతున్నారని పైరవీకారులకు మాత్రం వెంటనే పనులు జరుగుతున్నాయని, పెబ్బేరు మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా వచ్చిన తహసిల్దార్ మురళి గౌడ్, రెవెన్యూ కార్యాలయంలో పైరవీకారులను ప్రోత్సహించకుండా మండల ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు.

## దశాబ్దాల నిర్లక్ష్యానికి పరిష్కారం చూపిన ఎమ్మెల్యే

- ఎందరో పాలకులు మారినా గోపాలపూర్ చెరువు పరిస్థితిలు మాత్రం మారలేదు
- ఎమ్మెల్యే నాగరాజు ఆదేశాల మేరకు చెరువును శుద్ధి చేసే పనులు ప్రారంభించిన అధికారులు



**వరంగల్, మే27 (నిఘా న్యూస్):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 56డివిజన్ గోపాల్పూర్ ఊర చెరువు పరిస్థితి గతంలో జరిగిన తప్పి దాలను సరి చేస్తూ కనీసం మిగిలిన ఉన్న చెరువునైనా కాపాడి దానికి పూర్వ వైభవం తెచ్చేందుకు వర్షాకాలం సమీపిస్తున్న గోపాల్పూర్ లోని పలు కాలనీలో ముంపుకు గురి కాకుండా తగు చర్యలు తీసుకునేందుకు ఇటీవల ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వ హించి అధికారులను అప్రమత్తం చేసిన ప్రక్రియలో భాగంగా వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు అనతి కాలంలోనే చెరువును పరిశీలించి నేడు శుద్ధి చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన అధికారులు. దశాబ్దాలుగా ఎందరు పాల కులు మారినా పరిస్థితులు మాత్రం మారలేదు అన్న చందంగా ఉంది గోపాల్ పూర్ ఊరచెరువు పరిస్థితి గోపాల్పూర్ ఊరికి కల్పతరువు లాంటి చెరువును గత పది సవంత్సరాల బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పూర్తిగా ద్వ%శ%సం చేశారు. చెరువు అనేది ప్రకృతి మనకు ఇచ్చిన సంపద. దానిని కాపాడవలసిన బాధ్యత పాలకులపై ఉన్నది. కాని పాలకులు వారి బాధ్యతను మరిచారు. ఇటీవల స్వయంగా ఎమ్మెల్యే నాగరాజు నగర మేయర్ గుండు సుధారాణి, అధికారులతో కలిసి పరిశీలించిన అనతి కాలంలోనే చెరువులు పరిరక్షిస్తూ మంగళవారం గోపాల్పూర్ ఊర చెరువు చెరువును శుద్ధి చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సందర్భంగా డివిజన్ ప్రజలు చెరువు పరిరక్షణ కమిటీ సభ్యులు, పలు కాలనీల వాసులు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకి అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## నాన్ అక్రిడేషన్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించండి

### నాన్ అక్రిడేషన్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చిరంజీవి



పెబ్బేరు, మే 27 (నిఘా న్యూస్): జిల్లాలోని నాన్ అక్రిడిటేషన్ జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు, డబుల్ బెడ్ రూములు వెంటనే మంజూరు చేయాలని నాన్ అక్రిడిటేషన్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మందడి చిరంజీవి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి అవిశ్రాంత పోరాటాలు చేస్తున్న ఏకైక సంఘం నాన్ అక్రిడిటేషన్ జర్నలిస్ట్ అసోసియేషన్ అని అన్నారు. ప్రజాస్వామ్యానికి మూల స్తంభాలు జర్నలిస్టులని, ప్రజలకు అండగా నిలిచే ఆయుధాలు జర్నలిస్టులేనని సమాజంలో మంచి, చెడులను ఎత్తి చూపి ఏ స్వార్థం లేకుండా ప్రజల శ్రేయస్సు కోరుకునేది పత్రికా విలేఖరులేనని అన్నారు. ఇంకా ఎలాంటి జాప్యం లేకుండా జిల్లాలోని నాన్ అక్రిడిటేషన్ వర్కింగ్ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూంలు మంజూరు. చేయాలని, అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్య కార్డులపై నగదు రహిత వైద్య సేవలు అందించాలని, నూతన అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, పని చేసే ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు చిన్న పత్రిక పెద్ద పత్రిక అని తేడా లేకుండా ఇంటి స్థలం లేదంటే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని కోరారు. విధి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టులకు ఐదు లక్షల ఎక్స్ గ్రేషియా ఇస్తూ ఆ కుటుంబానికి నెలకు ఐదు వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో జర్నలిస్టులు పడ్డ బాధలు వర్ణనాతీతమని అన్నారు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియలో జర్నలిస్టులు ముఖ్య పాత్ర వహించారని గుర్తు చేశారు.

## భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



**లోకేశ్వరం మే 27 (నిఘా న్యూస్):** భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం రానున్న నాలుగు రోజులు ఉత్తర తెలంగాణా జిల్లాలలో ముఖ్యంగా నిర్మల్ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు నదులు, వాగులు, వంకల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ సూచించారు. విద్యుత్ తీగలు తెగినట్లయితే లేదా ఇతర ప్రమాదకర పరిస్థితులు ఏర్పడినపుడు వెంటనే సంబంధిత విద్యుత్ శాఖకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. అత్యవసర అవసరాల కోసం జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్ 63056 46600 ను సంప్రదించాలని, రైతులు తమ పంటలను సురక్షితంగా ఉంచేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు అధికంగా కురిసే ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీస్, మునిసిపల్, పంచాయతీ, వ్యవసాయ శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు.

## ఆపరేషన్ కాగార్‌ను వెంటనే అపాలి

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్ర చారి




**అబ్దుల్లాపూర్‌మెట్, మే 27 (నిఘా న్యూస్):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజ రవీంద్ర చారి అన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం, కుంట్లూరు రాజీవ్ గృహకల్ప శాఖ మహాసభ సమావేశం మంగళవారం కామ్రేడ్ డావుల రాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ ముత్యాల యాదిరెడ్డి హాజరై మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగారి పేరుతో పూటకు ఎన్కౌంటర్లు చేసి అమాను షంగా చంపుతున్నారని మొన్న జరిగిన ఛత్తీస్గఢ్ ఎన్కౌంటర్లో పట్టుకొని కాల్చి చంపారని కనీసం మృతి చెందిన భౌతిక కాయాలకు గౌరవంగా కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు చేయకుండా పోలీసులే సామూహిక దహనాలు చేయడం ఏ మానవత్వానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతి కోసం చర్చలకు అంగీకరించని ప్రభుత్వం దుర్మార్గం అని ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగారును వెంటనే ఆపి చర్చలు జరపాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సమ సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ప్రభుత్వాలు మారినా ప్రజల తల రాతలు మారలేదని ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడం లేదని ప్రజల తరఫున ప్రజా ఉద్యమాలు నిర్మించి పోరాడుతామని హెచ్చరించారు. వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నా ప్రభుత్వ నియంత్రణ లేదని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు స్థలం ఇచ్చి ప్రభుత్వమే కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ హరి సింగ్ నాయక్, ప్రజానాట్యమండలి నాయకుడు గణేష్, రాము, వెంకట్, బాబు, వలి, నరసింహ, శ్రీను, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్లలో ప్రాధాన్యత కల్పించాలి

### తెలంగాణ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షులు శానూర్ బాబా



**భువనగిరి, మే 27(నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా భువన గిరి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ గృహ పథకంలో జర్నలిస్టులకు ప్రథమ ప్రాధాన్యత కల్పించాలని తెలంగాణ జర్నలిస్టు యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా అన్నారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకము మరియు రాజీవ్ యువ వికాస్ పథకంలో జర్నలిస్టులకు ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టులు అద్దె ఇండ్లలో ఉంటూ జీవనం సాగిస్తున్నారని, ప్రజా సమస్యలపై నిరంతరం ఎప్పటికప్పుడు ప్రజలకు ప్రభుత్వానికి వారదులుగా పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం కల్పిస్తున్న పలు పథకాల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్టు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న, రాష్ట్ర నాయకులు సుక్క అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ రషీద్ జిల్లా కార్యవర్గ సభ్యులు జి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కాలబైరవ స్వామి ఆలయంలో అన్నదానం




**అంబర్‌పేట, మే 27 (నిఘా న్యూస్):** అమావాస్య సందర్భంగా అంబర్ పేట తిరుమలానగర్ శ్రీ వినాయక సహిత కాలభైరవ స్వామి, సూర్య భగవాన్ దేవాలయం ప్రత్యేక పూజలు జరిగాయి. దేవాలయ వ్యవస్థాపకుడు యువ ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా అధికారి కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంబర్ పేట శాసనసభ్యుడు కాలేరు వెంకటేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త బోర్లగుంట దీపక్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సురేష్ గౌడ్, దేవాలయ కమిటీ సభ్యులు పుట్టి వేద వ్యాస్, పటేల్, ఓం ప్రకాష్, శివ, ఉదయ్ కిరణ్, మహేష్ కుమార్, ప్రదీప్, రాహుల్, మహేందర్ ముదిరాజ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## దీన్ దయాల్ నగర్‌లో రోడ్డు నిర్మాణానికి చర్యలు

### కార్పొరేటర్ సునీత యాదవ్



**మల్కాజిగిరి, మే 27 (నిఘా న్యూస్):** దీన్ దయాల్ నగర్ కాలనీలో రోడ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని మౌలాలి డివిజన్ కార్పొరేటర్ గున్నాల సునీత యాదవ్ అన్నారు. మంగళవారం ఆమె, ఏఈ మధురిమ, బీజేపీ సీనియర్ నాయకులు వాసుదేవరావుతో కలిసి మౌలాలి డివిజన్ పరిధిలోని దీన్ దయాల్ నగర్ఆ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె కాలనీ వాసులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కాలనీ లో అధ్వాన్నంగా ఉన్న రోడ్డును ఏఈ మధురిమకు చూపించారు. గత 20 సంవత్సరాలుగా ఇక్కడ రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదని, గుంతలమయంగా మారిన ఈ రోడ్డుని వెంటనే అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా కార్పొరేటర్, ఏఈని ఆదేశించారు.

# బీరన్న పెద్ద పండుగ లగ్న బోనం

### నెత్తిపై లగ్న బోనం ధరించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**వరంగల్, మే 27 (నిఘా న్యూస్):** వరంగల్ నగరంలోని 66వ డివిజన్ పరిధిలో కురుమలకు ఇల వేలుపు అయిన బీరన్న స్వామి ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆలయంలో బీరన్న పెద్ద పండుగ సందర్భంగా ఉదయము బిరన్న లగ్న బోనం కురుమ గొల్ల కులస్తులకు ఇలవేల్పు అయిన బిరన్న స్వామికి కురుమ గొల్లలు ఉదయాన్నే లేచి ఇంటిని శుద్ధిచేసి కొత్త దుస్తులను ధరించి నిండు ఒక్కపొద్దు ఉండి బిరన్న స్వామికి ఇష్టమైన పాలు బెల్లం బియ్యంతో నైవేద్యాన్ని కుమ్మరి కుండలో తయారుచేసి బండారు, బంతిపూలు మామిడి తోరణంతో అలంకరించి సాంప్రదాయ దుస్తులను ధరించి కురుమ గొల్ల మహిళలు లగ్న బోనములు నెత్తిపై ధరించి ఇంటి నుండి బోనంతో కడప దాటే సమయంలో ఇంటి యజమానుడు బిందెలో నీళ్లు తీసుకువచ్చి బోనానికి ఆరగింపు చేస్తారు. ప్రతి ఇంటి నుండి లగ్న బోనాలు మహిళలు నెత్తిపై ధరించి ఇంటి ఆడపడుచులు మంగళ హారతులతో గ్రామంలోని వీధుల నుండి స్వామి ఆలయానికి బయలుదేరుతూ బిరన్న స్వామి సమస్త లోకానికి అంతా మంచి జరగాలని మీకు ఇష్టమైన నైవేద్యములు తయారు చేసుకొని మా ఇంటి నుండి మీ ఆలయ సన్నిధికి తీసుకు వస్తున్నాము మమ్మల్ని చల్లంగా చూడు బిరన్న స్వామి అంటూ ఆడపడుచులు వేడుకున్నారు. హసన్ పర్తి గ్రామంలోని వీధి వీధినా బోనాలతో పండుగ వాతావరణం ఏర్పడింది కురుమ డోలు చప్పులతో కురుమ ఒగ్గు పూజారులు నృత్యాలు విన్యాసాలు చేస్తూ సందడి చేశారు ప్రాంతమంతా మైకులలో బిరన్న నామస్మరణతో మారు మోగింది. బోనాలు ఆలయానికి చేరుకున్నాయి. స్వామివారికి ఇష్టమైన నైవేద్యాన్ని స్వామివారికి ఎదురుగా బోనాలు పెట్టి ఆకులో నైవేద్యం పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఒగ్గు కురుమ పూజారులచే లగ్న పట్నం వేశారు. ఈ పెద్ద పండుగకు ఆహ్వాన మేరకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు మంగళవారం ముఖ్యఅతిథిగా బిరన్న స్వామి ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు అనంతరం బిరన్న స్వామికి ఇష్టమైన గొంగళిని ఎమ్మెల్యే నాగరాజుకు ఆలయ పెద్దలు స్వాగతం పలికి గొంగళిని భుజంపై కప్పారు. బోనాల శోభాయాత్రలో ఎమ్మెల్యే నెత్తిపై బోనం ధరించిన ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలపై బిరన్న స్వామి ఆశీస్సులు ఉండాలని వారు కోరారు. రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. లగ్న బోనాలు చెల్లించిన తరువాత ఒగ్గు పూజారులు లగ్న పట్నం వేసి లగ్న కథను వినిపించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు వివిధ రాష్ట్రాల జిల్లాల పట్టణాల గ్రామాల మండలాల నుంచి విచ్చేసిన ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం



**మహేశ్వరం, మే 27(నిఘా న్యూస్):** జూన్ 2న మహేశ్వరం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించుకుందామని మహేశ్వరం నియోజకవర్గం టిఆర్ఎస్ సెక్రటరీ సామ మహేందర్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని సరూర్ నగర్, ఆర్కే పురం, బడంగ్పేట్, మీర్పేట్ కార్పొరేషన్ పరిధిలో, జల్పల్లి, తుక్కుగూడ మున్సిపల్ పరిధిలో, కందుకూరు మహేశ్వరం మండలాలలోని కాలనీ, బస్తీలలో గ్రామాలలో, వివిధ కార్యాలయాల్లో టిఆర్ఎస్ పార్టీ గులాబీ జెండాను ఎగురవేసి పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ జూన్ 2 సాధారణ తేదీ కాదన్నారు. ఒక జాతి చరిత్రను మలచిన పుణ్య దినం అన్నారు. తలవంచని తెలంగాణ ప్రజల గుండె ధైర్యానికి నిలువెత్తు నిదర్శనం అన్నారు. పార్టీ సీనియర్ నాయకులు, శ్రేణులంతా కలిసికట్టుగా పాల్గొనాలని, ప్రజలతో కలిసి అవతరణ వేడుకలు ఘనంగా జరుపుకుందాం అన్నారు.

## నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేసిన పోలీసులు



**వలిగొండ, మే 27 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో నెంబర్ ప్లేట్ లేని వాహనాల పై మంగళవారం వలిగొండ ఎస్సై వి. యుగేందర్ ఆధ్వర్యంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వి యుగేందర్ మాట్లాడుతూ నెంబర్ ప్లేట్ లేని ఐదు వాహనాలను సీజ్ చేశామని తెలిపారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేసే ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని అన్నారు. మండల ప్రజలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని, ప్రతి వాహనానికి స్పష్టంగా నెంబర్ ప్లేట్ కనపడేలా వాహనానికి అమర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం ఆలయంలో సంగీత దర్శకుడు కీరవాణి ఆలయానికి విచ్చేసి ఆయనకి ఆలయ అధికారులు వీఆర్వో రవి ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసి స్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. మరో దర్శకుడు దిల్ రాజు కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేయగా ఆయనకు ఆలయ అధికారులు దర్శనం ఏర్పాటు చేశారు. మృత్యుంజయ స్వామి వద్ద తీర్థప్రసాదాలు ఆలయ అధికారులు అందజేశారు.

– శ్రీకాళహస్తి, మే 27 (నిఘా న్యూస్):

## అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలి

### చింతల లక్ష్మయ్య వర్ధంతిలో ఊట్ల కొండలరావు



**మధిర, మే 27(నిఘా న్యూస్):** కార్మిక వర్గంకోసం, పేద ప్రజలకోసం తమ జీవితాలను అంకితం చేసి పోరాడిన నాటి అమరవీరుల త్యాగాలు స్మరించుకుంటూ వారి ఆశయాల సాధనకోసం నేటితరం కమ్యూనిస్టులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు,రైతు సంఘం మండల అధ్యక్షులు పంగా శేషగిరిరావు కోరారు.మంగళవారం మున్సిపాలిటీ పరిధి మడుపల్లి సిపిఐ కార్యాలయం అజయ్ భవనంలో సీనియర్ కామ్రేడ్ అమరజీవి చింతల లక్ష్మయ్య 18వ వర్ధంతిని జల్లా బ్రహ్మం అధ్యక్షతన జరిగింది.తొలుత నేతలు లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఊట్ల కొండలరావు,పంగా శేషగిరిరావు మాట్లాడుతూ, కమ్యూనిస్టు పార్టీ పిలుపుతో ఈ ప్రాంతంలో పాలకుల అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ నిర్వహించిన అనేక పోరాటాల్లో చింతల లక్ష్మయ్య ముందుండే వారన్నారు.

ప్రజాక్షేత్రంలో ఉంటూ వారికి సేవలందించిన పార్టీలని, పార్టీ నేతల్ని ప్రజలు ఆదరిస్తారని,ఓట్లకోసం, సీట్లకోసం ప్రాకులాడే పార్టీ కమ్యూనిస్టు పార్టీ కాదన్నారు.సమసమాజ నిర్మాణం కోసం పోరాడిన నేతలే నేటి తరానికి ఆదర్శం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి మంగళగిరి రామాంజనం, తలారి రమేష్, అన్నవరపు సత్యనారాయణ, రంగు నాగ కృష్ణ, సిపిఐ మడుపల్లి గ్రామ శాఖ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న కానిస్టేబుళ్లను సన్మానించిన సీఐ



**మధిర, మే 27(నిఘా న్యూస్):** మధిర టౌన్ పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్గా పనిచేసి బదిలీపై వెళ్తున్న ముగ్గురికి మంగళవారం పోలీస్ స్టేషన్లో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సీఐ డి.రమేష్, పిఎస్ఐ నవిత సిబ్బందితో కలిసి సత్యనారాయణ, శ్రీనివాస్ రాజ్, వెంకటేశ్వరరావులకు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం సీఐ రమేష్ మాట్లాడుతూ, పోలీస్ ఉద్యోగం అనేది అన్ని ప్రభుత్వ ఉద్యోగాల కంటే చాలా కీలకమైనదన్నారు. టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బదిలీపై వెళ్తున్న కానిస్టేబుళ్లు అందించిన సేవలను కొనియాడారు.భవిష్యత్ ఉద్యోగ జీవితంలో నిజాయితీగా, నిబద్ధతతో వృత్తి పట్ల అంకితభావం పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు





**హుజురాబాద్, మే 27 (నిఘా న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తే మాజీ సర్పంచ్లను ముందస్తు అరెస్టులు ఎందుకు చేస్తున్నారని మాజీ సర్పంచ్ బింగి కర్ణాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణంలోని పోలీస్ స్టేషన్లో మంగళవారం సర్పంచ్ లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రెండు రోజుల క్రితం గ్రామపంచాయతీ బిల్లులు 153 కోట్ల 10లక్షల వరకు ఉన్న 9,990 బిల్లులు చెల్లించినట్లు, ఎస్ డి ఎఫ్ గ్రాండ్ కింద 85 కోట్లు చెల్లించినట్లు ప్రకటనల ద్వారా ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో చేసిన పనులు పనులు కావా, ఈ ప్రభుత్వంలో చేసిన పనులకే కాంగ్రెస్ కార్యకర్తలకే బిల్లులు చెల్లిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో కేసీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి మాజీ సర్పంచ్లకు సంబంధించినటువంటి బిల్లులు ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. సర్పంచ్లను ముందస్తు అరెస్టు చేస్తూ మానసికంగా ఆర్థికంగా దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన పెద్దపెద్ద కాంట్రాక్టర్ల దగ్గర కమిషన్లు తీసుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందని ఆరోపించారు. వెంటనే బిల్లులు చెల్లించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు మనోహర్, లక్ష్మారెడ్డి, తిరుమల తిరుపతి, నిరోషా కిరణ్ తో పాటు తదితరులు ఉన్నారు.

## మహానాడు హాజరైన తిరుపతి నేతలు



**తిరుపతి, మే 27 (నిఘా న్యూస్):** కడపలో మూడు రోజులపాటు జరుగుతున్న తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమంలో తిరుపతికి చెందిన బిఎంఆర్ ట్రావెల్స్ అధినేత, ఏర్పేడు మండల టిడిపి బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గొడుగు మునిరాజా యాదవ్ మొదటిరోజు మంగళవారం హాజరయ్యారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలం నుండి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పేరం నాగరాజు నాయుడు, కార్యనిర్వక కార్యదర్శి పుప్పాల సుబ్రహ్మణ్యం, మడిపాక మాజీ సర్పంచ్ రవి నాయుడు, టిడిపికి చెందిన దేవేందర్ నాయుడు గుణ యాదవ్, గోల్డ్ మాన్ శివ పార్టీ కార్యకర్తలు భారీగా తరలి వెళ్లినట్లు బొడుగు మునిరాజు యాదవ్ తెలిపారు.

## యోగా దశాబ్ది వేడుకలకు సన్నాహాలు

### ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ రావు





**హైదరాబాద్, మే 27 (నిఘా న్యూస్)** జూన్ నెల 21న జరుపుకునే అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని యోగా దశాబ్ది వేడుకలకు సన్నహాక కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని సీనియర్ ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు వెల్లడించారు. నగరంలోని ప్రభుత్వ పాలి క్లినిక్ ఆయుర్వేదం కింగ్ కోటి హైదరాబాద్ గాంధీ కుటీర్ కమ్యూనిటీ హాల్లో సీనియర్ ఆయుర్వేదం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ రావు, హిమాయత్ నగర్ కార్పొరేటర్ శ్రీలక్ష్మి, బొగ్గులకుంట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ లక్ష్మీ ప్రసన్న, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా సీనియర్ ఆయుర్వేదం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ మే నెల 27వ తేదీ నుండి జూన్ నెల 21వ తేదీ వరకు యోగ దినోత్సవం దశాబ్ది వేడుకలు జరుపుకొనుటకు ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందని పేర్కొన్నారు. యోగ ఆసనాలు అవశ్యకతను వివరించారు. సంబంధిత డాక్టర్లు, యోగా శిక్షకులు నరేష్, ప్రియాంక, ఆశా కార్యకర్తలు, గాంధీ కుటీర్ వాలంటీర్లు ఏకమై మొదటి రోజు సామాన్య యోగ ప్రణాళిక ద్వారా నిర్దేశించిన యోగ ఆసనాలను అభ్యాసనం చేయించారు.

## కాంగ్రెస్ ప్రజా పాలన అంటే ఇదేనా..?

### మాజీ రైతుబందు మండల అధ్యక్షుడు గోపాల్ రావు



**ముస్తాబాద్, మే 27(నిఘా న్యూస్):** సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై కాంగ్రెస్ నాయకులు దాడికి ప్రయత్నించారని ముస్తాబాద్ మండలం మాజీ రైతుబంధు అధ్యక్షుడు బిఆర్ఎస్ నేత కల్వకుంట్ల గోపాల్ రావు పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాడికి యత్నించిన కాంగ్రెస్ నాయకులను అడ్డుకునేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకులపై పోలీసుల లాఠీ ఛార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. పాలన చేతగాక ప్రజా సమస్యలను పక్కదారి పట్టియడానికి ఏదో ఒక గొడవ సృష్టించి సంక్షేమ పథకాలు అందించకుండా ఉండడానికి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఇలాంటి గొడవలు సృష్టిస్తున్నారని వెల్లడించారు. బిఆర్ఎస్ నాయకులపై పోలీసుల లాఠీ చార్జ్ హేయమైన చర్యగా భావిస్తున్నామన్నారు. గొడవలతో రాజకీయడం చేయడం సబబు కాదని ఏ సమస్య అయినా శాంతియుతంగా పరిష్కరించుకోవాలని హితోపలికారు.

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలకు డిమాండ్



**భువనగిరి, మే 27 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి కలెక్టరేట్లో బిఆర్ఎస్ పార్టీ భువనగిరి పట్టణ, మండల యువజన,విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారికి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు స్కూళ్లు మరియు కళాశాలల పై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో యువజన విభాగం పట్టణ అధ్యక్షులు పెంట నితీష్, మండల అధ్యక్షులు ముల్లె నాగేంద్ర బాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి నాగారం సూరజ్, బిఆర్ఎస్ వి మండల అధ్యక్షులు కంకల మహేష్ నాయకులు ఇండ్ల శ్రీను, యాస సంతోష్ రెడ్డి, మోత్కుపల్లి అజయ్, రొయ్యల పవన్, తుమ్మల వినోద్, భూషపక మనీష్, అరిగే విక్రాంత్, సురేష్ ముదిరాజ్, ఉదయగిరి ఆకాష్,రసాల లింగస్వామి, సుమన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## బృందావన్ కాలువకు ఇరువైపులా గోడ నిర్మించాలి



**మోత్కూరు, మే 27 (నిఘా న్యూస్):** మోత్కూరు మున్సిపాలిటీలోని పెద్ద చెరువు కాలువ,బృందావన్ కాలువ ఇరువైపులా ప్రహరి గోడ నిర్మించాలని బి.ఆర్ఎస్ జిల్లా నాయకులు బందేల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మోత్కూరు లో విలేకరులతో మాట్లాడుతూ ఈ కాల్వల ఇరు వైపుల ప్రహరి గోడ లేక తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు.ఈ క్రమంలోనే సోమవారం మండలంలోని పాటిమట్ల గ్రామానికి చెందిన చిరుమర్తి సోమయ్య వృద్ధుడు చెరువు కాలువలో పడి తలకు త్రీవ గాయాలైయ్యాయి తెలిపారు.రానున్న వర్షాకాలంలో వర్షాలకు నీటి ఎద్దడి పెరిగి మరింత ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని, తక్షణమే మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువలకు ఇరువైపున ప్రహారీ గోడ నిర్మించాలని కోరారు.

# రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ

### యువత గుండె నిండా దేశభక్తి నింపుకోవాలి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**తిరుపతి, మే 27(నిఘా న్యూస్):** స్థానిక తిరుపతి బాలాజీ కాలనీలోని జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి నాలుగు కాళ్ల మండపం వరకు అంగరంగ వైభవంగా దేశ భక్తి ఉట్టి పడినట్లు ఉత్సాహంగా ఆపరేషన్ సింధూర్ విజయోత్సవం, తిరంగా ర్యాలీ ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు ముందుగా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి, జెండా ఊపి తిరంగా ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ భారత దేశంలో ఉన్న యువత వారి గుండెనిండా దేశభక్తి నింపుకోవాలని నరేంద్ర మోడీ, పవన్ కళ్యాణ్ చంద్రబాబు నాయుడు ముగ్గురూ త్రిమూర్తుల్లా ఉంటూ సంఘ విద్రోహ శక్తులను, ఉగ్రమూకలను, శత్రు దేశ ఆగడాలను అరికట్టడంలో సమైక్య ఆలోచనలతో ముందుకు వెళ్తూ ఉండడం,మనందరి పెద్దన్న లా మోడీ ఆపరేషన్ సింధూర్లో తీసుకున్న నిర్ణయాలు ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల మద్దతు మనకు లభించేలా చేసిందని అన్నారు. రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల మాట్లాడుతూ పహల్గాం దాడిలో ఉగ్ర మూకలు మన ఆడబిడ్డల సింధూరాన్ని చెరిపేశాయని, చనిపోయిన వారికి ప్రగాఢ నివాళి అర్పిస్తూ ఈ సందర్భంలో విప్లవాత్మకమైనటు వంటి నిర్ణయం తీసుకున్న నరేంద్ర మోడీ ఉగ్ర నరసింహుని లాగా ఆపరేషన్ సింధూర్ ప్రకటించి శత్రుదేశ ఉగ్రమూకలను, వారి స్థావరాలను ఆపరేషన్ సిందూర్కు సారథులుగా ఇరువురు వీర వనితలు కల్నల్ సోఫియా ఖురేషి మరియు వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ల చేత తుద ముట్టించి విజయవంతం చేశారని, ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడం ప్రతి భారతీయుడు గర్వించే సందర్బమని ఇప్పటికైనా శత్రుదేశ మైన పాకిస్తాన్ బుద్ధిగా నడుచుకోవాలని లేదంటే భారతీయుల ఉగ్రరూపం చవి చూడాల్సి వస్తుందని హితవు పలికారు. భారతీయులం శాంతి కాముకులమే గాని పిరికి వాళ్ళము కాము అని చెప్పారు. ముఖ్యంగా యువత మేలుకొని మంచి సైంటిస్టులుగా మన దేశానికి మరింత పటిష్ట మైన దృడమైన ఆయుధ సంపదను సమ కూర్చాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన యాదవ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నరసింహ యాదవ్, తిరుపతి డిప్యూటీ మేయర్ మునికృష్ణ మాట్లాడుతూ తిరుపతి నగరంలో వినూత్నంగా బ్యాండ్ మేళంతో కోలాటం, చెక్కభజన లాంటి సాంస్కృతిక కార్యక్రమాలతో తిరంగా ర్యాలీ జరపడం నిజమైన దేశభక్తిని చాటుకోవడమని దీనిని ఎంతో ఉత్సాహంతో నిర్వహించిన డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల అభినందనీయులు, అందరికీ ఆదర్శ వంతుదని కొనియాడుతూ ఇప్పటికైనా పాకిస్తాన్ పిల్ల చేష్టలు చేయడం మానుకోవాలని హెచ్చరిస్తూ ఆపరేషన్ సింధూర్లో ప్రాణాలు కోల్పోయిన వీర జనానులకు జోహార్లు తెలియజేశారు. ర్యాలీలో భాగంగా బాలాజీ కాలనీ నుంచి నాలుగు కాళ్ళ మండపం వరకు అంగరంగ వైభవంగా చెక్కభజన, కోలాటం, పిల్లన గ్రోవి నాట్య ప్రదర్శన లు,బ్యాండ్ మేళంతో దేశభక్తి ఉట్టి పడేలా ప్రదర్శన, డీజే సౌండ్ సిస్టంతో దేశభక్తి గీతాలు ఆలాపనలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఎన్టీఆర్ సర్కిల్ దగ్గర నరసింహ యాదవ్, ఆర్.సి మునికృష్ణ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ర్యాలీ కొనసాగించగా నాలుగు కాళ్ల మండపం దగ్గర ర్యాలీ ముగిసింది. కార్యక్రమంలోని సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకోవడమే కాకుండా తిరుపతి పురవీధుల్లో ఉన్నవారి దేశభక్తిని ఇనుమడింపజేసి వారిని సైతం వీధుల్లోకి స్వచ్ఛందంగా రప్పించి యాత్రలో పాల్గొనేలా చేసింది. కార్యక్రమంలో రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ మొర్రిమేకల దేవరాజులు, సేవా కుటుంబం సభ్యులు సూరా శ్రీదేవి, సరళ, కార్గిల్ యుద్ధ వీరులు మాజీ సైనికులు ఎ.పి నాయుడు, అమర రాజ నుండి చంద్ర బాబు, గుర్రప్ప, మార్పు సేవాసంస్థ దళవాయి గుర్రప్ప, ఉపాధ్యాయులు సాంబి రెడ్డి, బాలాజీ, డాక్టర్ రాజ పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## ఫలించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడి దీక్ష

### పాఠశాలకు దారి కల్పించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్




**సికింద్రాబాద్, మే 27 (నిఘా న్యూస్):** చిలకలగూడ దూద్ బావి ప్రభుత్వ పాఠశాలకు ఎన్నాళ్ళకు న్యాయం జరిగింది.దస్థానికుల చొరవతో సదరు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దీక్షకు పూనుకున్నారు. దానితో ప్రభుత్వ అధికారుల్లో చలనం మొదలైంది. అనంతరం హైడ్రా అధికారులు స్పందించి హైడ్రా కమిషనర్ రంగనాథ్ చొరవ చేసుకొని పాఠశాల కు వెళ్ళే దారికి అడ్డుగా ఉన్న గోడను కూల్చేసి పాఠశాలకు వెళ్లేందుకు దారిని కల్పించారు.అనంతరం ప్రధానోపాధ్యాయుల దీక్షను విరమించడంతో పాఠశాల కు వచ్చే పిల్లలు ఉపాధ్యాయులు,స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చిలకలగూడ స్థానిక విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక నాయకులు, హైడ్రా అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## సుకుమా జిల్లాలో లొంగిపోయిన 18 మంది మావోలు



**చింతూరు, మే 27 (నిఘా న్యూస్):** చతిస్గడ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా కేంద్రంలో యస్పి కిరణ్ చౌహాన్ ఎదుట 18 మంది మావోయిస్టులు మంగళవారం లొంగిపోయారు. సుకుమార్ జిల్లాలో మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ లో భాగంగా సౌత్ బస్తర్ డివిజన్ పి ఎల్ జి ఏ నెంబర్ వన్ బెటాలియన్ తో సంబంధం ఉన్న నలుగురు హార్డ్ కోర్ మావోయిస్టులతో పాటు 18 మంది మావోయిస్టులు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని నిర్ణయించుకొని లొంగిపోయారు. లొంగిపోయిన మావోయిస్టులందరికీ 39 లక్షల రివార్డు ప్రకటించారు. చతిస్గడ్ ప్రభుత్వం మావోయిస్టుల లొంగుబాటు పునరావాసం విధానం కింద నిర్వహించబడింది. ఈ పథకం ప్రకారం మావోయిస్టు గ్రామపంచాయతీ ప్రకటించిన పంచాయతీకి కోటి రూపాయల అభివృద్ధి నిధి ప్రభుత్వం కేటాయిస్తుంది. ఈ ప్రయత్నాల వల్ల ప్రభావితమై చాలామంది మావోయిస్టులు జనజీవన స్రవంతి లో చేరడానికి ముందుకు వస్తున్నారు. లొంగిపోవటానికి జరిగే ప్రక్రియలో జిల్లా రిజర్వు గార్డ్స్, సుక్మా రేంజ్ ఫీల్డ్ టీం, కుంట, సుకుమా, జగదల్పూర్, సిఆర్పిఎఫ్ 80,212,219, కోబ్రా203 బెటాలియన్ల నిఘా విభాగాలు ముఖ్యమైన పాత్ర పోషించాయని ఎస్పి అన్నారు. మిగిలిన మావోయిస్టులు కూడా హింస మార్గం వీడి, లొంగిపోయి ప్రభుత్వ పునరావాస పథకాలను వినియోగించుకోవాలని కోరారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో తరచూ గాలింపు చర్యలు చేపట్టి, భద్రత దళాలు శిబిరాలను ఏర్పాటు చేయడంతో మావోయిస్టులు బలహీనపడి లొంగిపోతున్నారని దీని ఫలితమే ఈ లొంగుబాటు చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో సుకుమా జిల్లా, జగదల్పూర్, దంతివాడ, బీజాపూర్, సిఆర్పిఎఫ్, కోబ్రా, డి ఆర్ జి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను అడ్డుకున్న బిజెపి కార్పొరేటర్

### కార్పొరేటర్ ఇంటి ముందు బిజెపి నేతలు, బాలకృష్ణ నగర్ కాలనీ వాసుల ధర్నా



**రామంతాపూర్, మే 27(నిఘా న్యూస్):** అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారంటూ రామంతాపూర్ ఇందిరా నగర్ లో రామంతాపూర్ కార్పొరేటర్ శ్రీవాణి ఇంటి వద్ద బాలకృష్ణ నగర్ కాలనీ వాసులు మంగళవారం ధర్నా నిర్వహించారు.తమ కాలనీలో డ్రైనేజీ పైప్ లైన్ అభివృద్ధికోసం 72లక్షల రూపాయల పనులు మంజూరు అయితే ఆ పనులను స్థానిక బీజేపీ కార్పొరేటర్ అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ ఇంటి వద్ద రెండున్నర గంటలపాటు ధర్నా చేపట్టి కార్పొరేటర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ రామంతాపూర్ డివిజన్ లోని బాలకృష్ణ నగర్ కు డ్రైనేజీ లైన్ లేనందున స్థానిక కార్పొరేటర్ నుండి మొదలు సీఎం, పీఎం, రాష్ట్రపతి వరకు సమస్యను తీసుకెళ్ళమని, సమస్యను గుర్తించి 72లక్షల పనులు మంజీరయ్యాయని తెలిపారు. స్థానిక బీజేపీ కార్పొరేటర్ ఆ పనులను అడ్డుకుంటున్నారని అందుకే కార్పొరేటర్ ఇంటి వద్ద నిరసనకు దిగినట్లు వారు తెలిపారు.బీజేపీ యువ మోర్చా నేతలు కూడా బీజేపీ కార్పొరేటర్ ఇంటి ముందు ధర్నాకి దిగారు. బిజెపి కార్పొరేటర్ ఇంటిముందు బిజెపి యువచనేతలు ధర్నాలో పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది.కార్పొరేటర్ గెలుపు కోసం కృషి చేసినందుకు మా అభివృద్ధి పనులను అడ్డుకుంటారా అంటూ ఆ కాలనీవాసులతో పాటు, యువమోర్చా బిజెపి నాయకుడు మహేశ్వర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ నగర్ కాలనీవాసులతో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# మూసీ బఫర్ జోన్‌లో.. రాబందులు

- అంబర్‌పేట అలీకేఫ్ కొత్త రోడ్లులో కబ్జాకు గురవుతున్న మూసీ స్థలాలు
- బఫర్ జోన్ లో మట్టి పోసీ చదును చేస్తున్న కబ్జా రాయుళ్లు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ యంత్రాంగం



**అంబర్‌పేట, మే 27(నిఘా న్యూస్):** అంబర్ పేట మండల పరిధిలోని అలీ కేఫ్ సమీపంలో కొత్త రోడ్డు పరిసరాల్లోని మూసీ నది పరివాహక ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాలు(బఫర్ జోన్) యదేచ్ఛగా కబ్జాకు గురవుతున్న హైదరాబాద్ జిల్లా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడంలేదనే ఆరోపణలు సర్వత్ర వెల్లువెత్తుతున్నాయి. గత కొద్దిరోజులుగా కొంతమంది మూసీ బఫర్ జోన్‌లో బహిరంగంగా మట్టి పోసి జెసిబిలతో చదును చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. బఫర్ జోన్ అని చూడకుండా మట్టి పోసి యదేచ్ఛగా చదును చేస్తున్న రెవెన్యూ యంత్రాంగం చోద్యం చూస్తుందనే ఆరోపంలో వస్తున్నాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అప్పటి నిజాం ప్రభుత్వం మూసీ పరివాహక ప్రాంతంలో కొందరికి గడ్డి పెంచుకోవడానికి స్థలాలను లీజుకిచ్చింది. కేవలం ఈ స్థలాల్లో సదరు లీజుదారులు పశువుల కోసం గడ్డి పెంచుకోవడం, తద్వారా ఉపాధి పొందాల్సి ఉంది. ఈ లీజు స్థలాలను అమ్మడం, కొనడంపై నిజాం ప్రభుత్వం అప్పట్లోనే నిషేధం విధించింది. అయితే రాను రాను కొంతమంది లీజుదారులు గడ్డి పెంచుకోవడానికి కేటాయించిన మూసీ బఫర్ జోన్ లోని విలువైన స్థలాలలో మట్టి పోసి చదును చేసి ప్లాట్లుగా చేసి విక్రయించి లక్షలాది రూపాయలు గడించారు. ఈ క్రమంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ స్థలాలను పరిరక్షించి సుందరీకరణ పనులు చేపట్టాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనిపై రెవెన్యూ, మున్సిపల్ యంత్రాంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు సైతం జారీ చేసింది. ఒకపక్క రెవెన్యూ, జిహెచ్ఎంసి యంత్రాంగం మూసీ పరిసరాల్లో సర్వేలు నిర్వహించి సరిహద్దులను నిర్ధారించే పనుల్లో ఉండగా మరోపక్క కబ్జాదారులు ఏమాత్రం భయపడకుండా బఫర్ జోన్‌లో మట్టి పోస్తూ విలువైన ప్రభుత్వ స్థలాలను అమ్మే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా అలీ కేఫ్ నుంచి నాగోలుకు వెళ్లేందుకు నిర్మించిన కొత్త రోడ్డులో మూసీ బఫర్ జోన్ స్థలాల్లో కొంతమంది మట్టి పోసి జేసిబిలతో చదును చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో అంబర్ పేట తహసిల్దార్ గా పనిచేసిన బిక్షపతి హాయంలో ఇక్కడి బఫర్ జోన్ స్థలాల్లో మట్టి పోసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకున్నారని, మట్టిని తరలించిన లారీలను ట్రాక్టర్లను సైతం సీజ్ చేసి కేసులు నమోదు చేశారని వారు గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం ఇదే మూసీ బఫర్ జోన్ లోని స్థలాలలో పట్టపగలు అందరూ చూస్తుండగా మట్టి పోస్తూ జేసిబిలతో చదును చేస్తున్న ప్రస్తుత అంబర్ పేట మండల రెవెన్యూ యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న సర్వేయర్ సైతం ఎలాంటి విచారణ జరపకుండా మూసీ పరివాహక ప్రాంతాల్లోని స్థలాలు ప్రైవేట్ వని చెప్పడం విడ్డూరంగా ఉందని వారంటున్నారు. గతంలో అంబర్ పేట రెవెన్యూ అధికారులే ఈ స్థలాలు బఫర్ జోన్ లో ఉన్నట్లు తేల్చి కబ్జాదారులను అడ్డుకోవడం జరిగిందని వారు తెలిపారు. అయితే ప్రస్తుతం అంబర్ పేట మండల కార్యాలయంలో పనిచేస్తున్న రెవెన్యూ అధికారులకు ఇవి ప్రైవేట్ స్థలాలని తేల్చడం అనుమానాలకు తావిస్తుందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా హైదరాబాద్ జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి విలువైన మూసీ స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సిఐటియు చుక్కరాములు కార్మిక ద్రోహి

- ఎంఆర్ఎఫ్‌లో కార్మికుల బానిస బతుకులు మారాలి
- కెపిఎస్ అధ్యక్షులు కొత్త గొల్ల శేఖర్






**సంగారెడ్డి, మే 27(నిఘా న్యూస్):** కార్మికుల అభివృద్ధి కోసం ఎం ఆర్ ఎఫ్ టైర్ల పరిశ్రమలో పని చేస్తున్నా ఏకైయిక కార్మిక సంఘం కెపిఎస్ కార్మిక సంఘమని ఎం ఆర్ ఎఫ్ కార్మికు సంఘం అధ్యక్షులు కొత్త గొల్ల శేఖర్ అన్నారు. మంగళవారం కెపి ఎస్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గెట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏండ్లుగా ఎం ఆర్ ఎఫ్ పరిశ్రమ అభివృద్ధి నిరంతరం కృషి చేస్తున్నా కార్మికుల బతుకులు మారటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎం ఆర్ ఎఫ్ పరిశ్రమ యజమాన్యం శ్రమిక శ్రమ దోపిడీ అడ్డు కట్ట వేయుటకు కార్మికులు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. సిఐటియు కార్మిక సంఘం కార్మికుల ద్రోహి ఆరోపించారు. కార్మికులు రెండు సార్లు ఎన్నికల్లో గెలిపించిన మోసం. చేసిందని అన్నారు. ట్రేడ్ యూనియన్‌లో అపర అనుభవం కార్మికులను మోసంచేయటమే తప్ప మరొకటి లేదని విమర్శించారు. గతంలో సిఐటియుసితో కలసి పని చేసిన కార్మికుల సరైయిన న్యాయం చేయలేక పోయమని పే ర్కొన్నారు. నేడు లోకల్ నాన్ లోకల్ అనే మాట చుక్క రాములు పేర్కొనటం సిగ్గు చేని అన్నారు. చుక్క రాములు నాన్ లోకల్ కార్మిక సంఘం నాయకుడేనాన్నరు.రాష్టం లో అన్ని ప్రశ్రమల్లో కార్మికులకు వెన్ను పోటు పొడవటంలో నెంబర్ వన్ చుక్క రాములు ఉన్నారని పేర్కొన్నారు. 350మంది కార్మికులను అక్రమంగా ఎంఆర్ఎఫ్ యాజమాన్యం తోలగిస్తే సిఐటియూ మౌనం ఎందుకు ఉందో కార్మికులకు తెలుపలన్నారు.

మహా మోసగాళ్ళు కళ్లి బొల్లి మాటలు చెప్పిన కార్మికుల సిఐటియు నమ్మలేరని తెలిపారు. తొమ్మిది కార్మిక సంఘాలు ఓటమి బయంతో కెపిఎస్‌పై దండ యాత్ర చేస్తున్నవని కార్మికులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నో ప్రలోభాలు పెట్టిన కార్మికులు నమ్మ కూడదని అన్నారు.మేనేజ్మెంట్ మెడలు వంచుటకు పులి గుర్తికు ఓటు వేయాలని పిలువు నిచ్చారు. బిఎంఎస్ బోనస్ కల్పిస్తామని తెలిపినా కార్మికులు నమ్మటం లేదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మారుస్తుందని సిఐటియూకు తెలువదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కెపిఎస్ కార్మిక సంఘం నాయకులు ఏఐటియూసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## ఆదివాసీల ఆత్మగౌరవం కొమురం భీమ్

### కొమురం భీం విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి సీతక్క



**లోకేశ్వరం, మే27 (నిఘా న్యూస్):** ఆదివాసీలకు అత్మగౌరవం, అస్తిత్వాన్ని కల్పించిన పోరాట యోధుడు కోమురం భీం అని మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం లోకేశ్వరం మండల కేంద్రంలోని ఆదివాసీ, తుడుందెబ్బ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోమురం భీం విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హజరై ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ తో కలిసి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలతో నృత్యాలు చేస్తూ గేయాలు ఆలపిస్తూ ప్రధాన వీధిలగుండ ర్యాలీ నిర్వహించి విగ్రహ ప్రతిష్టాపనకు వద్దకు చేరుకున్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి విగ్రహవిష్కరణ అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ కొమురం భీం లేకపోతే మన ఉనికి ఉండెది కాదన్నారు.కొమురం భీం పోరాటంతోనే హక్కులు సాధించబడ్డాయన్నారు. ఆయన పోరాట స్పూర్తితోనే సాగిన ఉద్యమం వల్ల తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని అన్నారు.నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా గెరిల్లా పోరాటం చేసిన గొప్ప యోధుడు కొమరం భీం అని,అడవిని జీవనోపాధిగా చేసుకొన్న కొమురం భీం నిజాంలను ఎదురించాడని అన్నారు. నిజాం సైనికులకు వ్యతిరేకంగా ఆయుధాలతో పోరాటం చేసాడని,పశువుల కాపర్ల పై విధించిన సుంకానికి వ్యతిరేకంగా ఉద్యమించాడని, జల్ జంగిల్ జమీన్ అనే నినాదంతో ఉద్యమించి వీరమరణం పొందాడని కొనియాడారు.కొమరం భీం అదివాసి అత్మగౌరవ ప్రతీక అని మంత్రి సీతక్క అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ ముధోల్ నియోజకవర్గం ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్,మాజీ ఎమ్మెల్యే జి విఠల్ రెడ్డి, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పటేల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, బిజెపి మండల అధ్యక్షుడు సాయన్న, గంజాల గంగాధర్, అట్టోలి రాజేశ్వర్, గోనేటి జగదీష్, కొండూరు శ్రీనివాస్, అన్నారం గంగాధర్,అల్లోల పెద్ద సాయిలు.తో పాటు మాజీ ప్రజా ప్రతినిధలు, తుడుందెబ్బ రాష్ట్ర,జిల్లా, మండల నాయకులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర,జిల్లా,బ్లాక్ మండల గ్రామ నాయకుల కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పై విజిలెన్స్ నివేదిక



**ఉప్పల్, మే 27 (నిఘా న్యూస్):** ఎస్ఆర్‌హెచ్ ఫ్రాంచైజీపై హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జగన్మోహనరావు ఒత్తిడి తీసుకొచ్చినట్టు విజిలెన్స్ అధికారులు నిర్ధారించారు. 10 శాతం టికెట్లు ఉచితంగా ఇస్తున్నప్పటికీ మరో 10 శాతం టికెట్లు అదనంగా డిమాండ్ చేసినట్టు తేల్చింది. ఎస్ ఆర్ హెచ్ మాత్రం 10 శాతం అదనపు టికెట్లు ఇచ్చేది లేదని తేల్చి చెప్పింది. దీంతో లక్నో మ్యాచ్ టైంలో విఐపి గ్యాలరీకి లాక్ వేసి ఎస్ ఆర్ హెచ్ ను హెచ్ సి ఏ. ఇబ్బందులు పెట్టినట్టు ప్రభుత్వానికి విజిలెన్స్ ప్రాథమిక నివేదిక సమర్పించింది.

## కబ్జాలు జరిగింది వాస్తవమే..!

- ఇరిగేషన్ అధికారుల విచారణలో వెలుగు చూసిన నిజాలు
- ఇప్పటికే నాలుగు సార్లు కబ్జాలను నిర్ధారించి మౌనం వహించిన అధికారులు..?



**హుజురాబాద్, మే 27 (నిఘా న్యూస్):** హుజురాబాదులో చిలక వాగు ఒడ్డున జరుగుచున్న అక్రమ కట్టడాలపై, ఇతర ప్రభుత్వ భూములు చెరువులు కుంటలు కబ్జాకు గురవుతున్నాయని కలెక్టర్ కు అందిన ఫిర్యాదు క్రమంలో జిల్లా స్థాయి ఇరిగేషన్ అధికారులు మంగళవారం మోకాపై వచ్చి విచారణ జరిపారు. హుజురాబాద్ మండలం పెద్ద పాపయ్యపల్లి గ్రామపంచాయతీ సర్వే నంబర్ 1353/ఏ 1353/బి ఇచ్చినటువంటి ఇంటి పర్మిషన్లలో చిలక వాగు బఫర్ జోన్‌లో నిర్మించిన ఇళ్లకు ఎలాంటి ఎన్ఓసి సర్టిఫికెట్ లేదని గ్రామపంచాయతీ ద్వారా ఆర్టిఏ నిర్ధారణ పత్రం పొందినట్టు కొలిపాక సమ్మయ్య అధికారులకు వివరించారు. చిలక వాగు ఒడ్డు విస్తీర్ణంకు పదింతలు బఫర్ జోన్‌లోకి రాగా మోకాపై ఉన్న అక్రమ కట్టడం చూసి అధికారులు ఆశ్చర్య పోయారు. వరంగల్ మెయిన్ రోడ్డులో కమర్షియల్ కాంప్లెక్స్ బిల్డింగ్ కట్టాలంటే ఇరిగేషన్ ఫైర్ శాఖల ఎన్ఓసి పత్రాలు తప్పనిసరి తీసుకోవాలి, కానీ దానికి భిన్నంగా చిలక వాగు బఫర్ జోన్ లో ఇంటి పర్మిషన్ ను గ్రామపంచాయతీ ద్వారా పొంది కమర్షియల్ కాంప్లెక్స్ కడుతున్నట్టు ముదిరాజ్ మహాసభ కొలిపాక సమ్మయ్య అక్రమ కట్టడాల కబ్జాలపై మండిపడ్డారు. ఇరిగేషన్ శాఖ వారు ఇప్పటికే నాలుగు సార్లు ఇలాంటి విచారణలు చేపట్టినట్టు కానీ విచారణ విచారకరంగానే ఉందని ఇప్పటికైనా సంబంధిత శాఖ పై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కొలిపాక సమ్మయ్య డిమాండ్ చేశారు.

### కబ్జాలను కూల్చి వేయండి



సర్వే నంబర్ 2477 లో 12 ఎకరాల 16 గుంటలు ఉండవలసిన గంగోని కంట శిఖం భూమి ఇపుడు కనీసం 6 ఎకరాలు కూడ లేదని అలాగే వరంగల్ రోడ్డు పక్కన చిలుకావాగును .జమ్మికుంట రోడ్డు పక్కన చెరువుల కట్టుకాలువలను కబ్జాచేసిన వారిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, కబ్జాలు అయిన శిఖం భూములు కాలువలను రికవరీ చేయించి వాటికి శాశ్వత హద్దులు ఏర్పాటు చేయించాలని ఈ సందర్భంగా కొలిపాక సమ్మయ్య ముదిరాజ్ డిమాండ్ చేసారు.

### విచారణ కొనసాగు తుందని ఇరిగేషన్ ఏఇ సునీత వివరణ


హుజురాబాద్ లోని చెరువులు, కుంటలు ,వాగులపై వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నట్టు అసిస్టెంట్ ఇంజనీర్ సునీత, వారి సిబ్బంది తెలిపారు. తమ విచారణను పై అధికారులకు రిపోర్ట్ అందిస్తామని తద్వారా త్వరలో పై అధికారులు ప్రభుత్వం తరపున స్పందన ఉంటుందని తెలిపారు. ఈ విచారణలో అధికారులు కీర్తి వర్క్ ఇన్స్పెక్టర్ సందీప్, లష్కర్ భాస్కర్, మొగిలి, రవి తదితరులు పాల్గొన్నారు.

## యువత రాజకీయాలపై ఆసక్తి చూపాలి

### భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపు



**బాలాపూర్, మే 27 (నిఘా న్యూస్):** భారత కమ్యూనిస్టు పార్టీ మీర్ పేట నగరపాలక సంస్థ పరిధిలోని 33 వ వార్డు శాఖ మహాసభ లెనిన్ నగర్ పార్టీ కార్యాలయంలో సిపిఐ పార్టీ నాయకులు తెలంగాణ గిరిజన సమాఖ్య మండల అధ్యక్షులు జాటోత్ రెడ్యా నాయక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి మాట్లాడుతూ దేశ జనాభాలో సగం జనాభా యువశక్తితో నిండి ఉందని ఈ దేశ భవిష్యత్తు యువకుల చేతుల్లోనే ఉందని అన్నారు.. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన యువకులు అన్ని దేశాలలో మన దేశ యువకులు ఉన్నారని సమాజానికి అన్ని రకాలుగా ఉపయోగపడుతున్న భారత యువత రాజకీయాల్లోకి ఆసక్తి చూపాలని యువకులు రాజకీయాల్లోకి రావాలని తద్వారా నేడు ఉన్న వ్యాపార రాజకీయాల స్థానంలో ప్రజా రాజకీయాలు వస్తాయని దోపిడి వ్యవస్థను కూల్చాలన్నా, దోపిడీ లేని సమాజం రావాలన్న అది యువకులతోనే యువశక్తితోనే సాధ్యమని పేర్కొన్నారు. అవినీతి, నిరుద్యోగం, పేదరికం దేశంలో నానాటికి పెరిగిపోతున్నాయని యువకుల చైతన్యం ద్వారానే వాటిని రూపుమాపగలమని చైతన్యవంతమైన యువత ప్రజా సంక్షేమానికి ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం సిపిఐ పార్టీ మీర్ పేట నగరపాలక సంస్థ 33 వ వార్డు శాఖ కౌన్సిల్ ను 8మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 33 వ వార్డు శాఖ కార్యదర్శిగా జాటోత్ రెడ్యా నాయక్, సహాయ కార్యదర్శిగా మిరియాల లక్ష్మమ్మ కౌన్సిల్ సభ్యులుగా కేతావత్ శీను నాయక్, వద్యా దత్తు నాయక్, మహేందర్, గోవింద్ నాయక్, కైలాస్ నాయక్, వెంకటయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు దేరంగుల శంకరయ్య, రమావత్ పాండు నాయక్, బండ యాదమ్మ యాదవ్, జాజాల అంజయ్య, రమావత్ చత్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.




Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com